# నవజ్యోతి

తెలుగు దినపత్రిక

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి: 01 సంచిక : 282 | ఎడిటర్.: మన్నే లక్ష్మణ్ | వెల:5/- | పేజీలు: 8 | శనివారం 01-08-2026


## భారీ వర్షా ల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి



- వాగులు, వంకలు, కాజ్‌వేల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలి
- పునరావాస కేంద్రాలు సిద్ధం చేయాలి

7

## 48 గంటల్లో చోరీ కేసు ను చెందించిన పోలీసులు....

- 15 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం
- నిందితుడి అరెస్ట్... రిమాండ్ కు తరలింపు....



6

# విదేశీ ఉద్యోగాలపై సీఎం కీలక ఆదేశాలు

### టామ్‌కాం ద్వారా ఉపాధి, పాస్‌పోర్టు సేవలు విస్తరించాలని సూచన

- విదేశీ భాషలు, డ్రైవింగ్ శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశం
- ఇంటర్న్‌షిప్‌లు, నైపుణ్య విశ్వవిద్యాలయంపై సీఎం సమీక్ష
- నర్సింగ్, విద్యుత్ వాహనాలు, డ్రోన్ కోర్సులు ప్రవేశపెట్టాలని సూచన

విదేశాల్లో ఉద్యోగాలు పొందాలనుకునే యువతకు అవసరమైన శిక్షణ, ఉద్యోగ మేళాలు, పాస్‌పోర్టు సౌకర్యాలు, విదేశీ ఉపాధి అవకాశాల కల్పన బాధ్యతలను తెలంగాణ విదేశీ మానవ వనరుల సంస్థకు అప్పగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.



**హైదరాబాద్, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి):**

నైపుణ్యాభివృద్ధి శాఖపై మంత్రి వివేక్ వెంకటస్వామి, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఉత్తర తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు మధ్యప్రాచ్య దేశాలకు ఉపాధి కోసం వెళ్తున్న నేపథ్యంలో వారు మోసపూరిత ఏజెంట్ల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. విదేశీ మానవ వనరుల సంస్థ ద్వారా వివిధ దేశాల

మిగతా 2 లో..





## ఆహార భద్రత కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వ శుభవార్త

- ఆగస్టు ముప్పై ఒకటి వరకు వివరాల నమోదుకు గడువు పెంపు..
- రాష్ట్రవ్యాప్తంగా అమలు.
- ఈరోజు నుంచి మూడు నెలల సరుకులు ఒకేసారి

**హైదరాబాద్, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణ రాష్ట్రంలోని ఆహార భద్రత (చౌక ధరల) కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. లబ్ధిదారుల వివరాల నమోదు (ఆధార్ అనుసంధాన) ప్రక్రియ గడువును ఆగస్టు ముప్పై ఒకటవ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తొలుత ఈ పొడిగింపు నిర్ణయం కేవలం హైదరాబాద్ నగరానికే పరిమితమని వార్తలు

మిగతా 2 లో..

## హైడ్రాపై హైకోర్టు ఆదేశం

- రంగనాథ్ స్థానంలో నియామకానికి ఆదేశం
- ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు
- కోర్టు ఆదేశాల ఉల్లంఘనపై చర్య
- చట్టబద్ధ పాలనకే ప్రాధాన్యం

2



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సంబంధించి తెలంగాణ హైకోర్టు మరో కీలక ఆదేశం జారీ చేసింది. న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘించిన నేపథ్యంలో ఆయన స్థానంలో మరొక అధికారిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

## కొండాపూర్ ఫెన్సింగ్‌పై హైడ్రా వివరణ

HYDRAA

- రెవెన్యూ అధికారుల విజ్ఞప్తి మేరకే చర్యలు చేపట్టినట్లు స్పష్టీకరణ
- సర్వే నంబరు 59లో మాత్రమే ఫెన్సింగ్ చేసినట్లు వెల్లడి

2



## పెద్ది మృతిపై కేసీఆర్ దిగ్భ్రాంతి

- ఆప్త మిత్రుడిని కోల్పోయానన్న కేసీఆర్
- పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా
- ఉద్యమ సహచరుడికి భావోద్వేగ నివాళి

2





2

## టీఆర్ టీయూ లోగో ఆవిష్కరణ

తెలంగాణ రక్షణ ట్రేడ్ యూనియన్ లోగోను ఆవిష్కరించిన కవిత

## భద్రాచలం వద్ద ఉగ్ర గోదావరి

44 అడుగులకు చేరిన నీటిమట్టం

మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

లంక గ్రామాల ప్రజలకు అప్రమత్త సూచనలు

రాష్ట్రంలో మరో రెండు రోజులు భారీ వర్షాలు

ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. శుక్రవారం ఉదయం నాటికి గోదావరి నీటిమట్టం 44 అడుగులకు చేరుకోగా, ప్రస్తుతం సుమారు 9,74,666 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది.

2





## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- 'నషా ముక్త్ భారత్'కు సీతక్క పిలుపు
- మాదకద్రవ్యాలపై అవగాహన పెంచాలని సూచన
- వ్యసన విముక్త సమాజ నిర్మాణమే లక్ష్యమని వెల్లడి
- 10 కోట్ల మంది ప్రతిజ్ఞలో భాగస్వామ్యం కావాలని పిలుపు

2

మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ప్రజలకు పిలుపునిచ్చారు.

## పెద్ది మృతి తీరని లోటు

### కేటీఆర్


- మాజీ ఎమ్మెల్యే మృతిపై కేటీఆర్ దిగ్భ్రాంతి
- తెలంగాణ ఉద్యమంలో విశేష పాత్ర పోషించారని నివాళి
- ప్రజల పక్షాన నిలిచిన నాయకుడిగా కొనియాడిన కేటీఆర్
- బీఆర్ఎస్‌కు, తెలంగాణకు తీరని లోటని వ్యాఖ్య

**హైదరాబాద్, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణ ఉద్యమ సహచరుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతితో పార్టీతో పాటు తెలంగాణ సమాజం ఓ నిబద్ధత కలిగిన ఉద్యమ నాయకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో పెద్ది సుదర్శన్ రెడ్డి కోలుకుని తిరిగి ప్రజల మధ్యకు వస్తారనే ఆశతో ఎదురుచూశామని కేటీఆర్

మిగతా 2 లో..





2

## భోగాపురంపై సీఎం ఉత్సాహం

- "ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు సిద్ధం" అంటూ సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- ప్రధాని మోదీ రాకతో అభివృద్ధికి కొత్త అధ్యాయం
- రేపు భోగాపురం అంతర్జాతీయ

"ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు సిద్ధమైంది... మోదీ జీ, మీ రాక కోసం ఎదురు చూస్తున్నాం" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు.



## నాలుగంతస్తుల భవనం నేలమట్టం

- దుర్ఘటనలో 9 మంది దుర్మరణం
- మరమ్మతుల సమయంలోనే ఘటన
- శిథిలాల తొలగింపు కొనసాగింపు

2

## భారత్‌కు జిన్‌పింగ్ రాక?

2

బ్రిక్స్ సదస్సుకు హాజరయ్యే అవకాశం



# ఆహార భద్రత కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వ శుభవార్త

**మొదటిపేజీ తరువాయి**

వచ్చినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం దీనిని తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్డుదారులందరికీ వర్తింపజేస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతోనే అధికారులు ఈ వెసులుబాటు కల్పించారు. అంతేకాకుండా, ఆగస్టు ఒకటవ తేదీ నుంచి కార్డుదారులకు మరో సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. లబ్ధిదారులు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి తీసుకోవచ్చని వెల్లడించారు. దీనివల్ల ప్రతినెలా సరుకుల కోసం దుకాణాల చుట్టూ తిరగాల్సిన అవసరం తప్పుతుంది. కార్డుదారులు తమ సమీపంలోని చౌక ధరల దుకాణాలకు వెళ్లి, వేలిముద్ర లేదా కంటిపాప ద్వారా తమ వివరాల నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. కుటుంబంలోని ఐదు సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ అసలు ఆధార్ కార్డులను వెంట తీసుకువెళ్లాలి. నిర్ణీత గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోకపోతే భవిష్యత్తులో ప్రభుత్వ ప్రయోజనాలు కోల్పోయే ప్రమాదం ఉందని, కాబట్టి ప్రతి ఒక్కరూ వెంటనే వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు.

# పెద్ది మృతి తీరని లోటు

**మొదటిపేజీ తరువాయి**

అయితే ఆయన ఇక లేరన్న వార్త తీవ్ర విషాదానికి గురి చేసిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన పాత్ర చిరస్మరణీయమని కేటీఆర్ కొనియాడారు. ఉద్యమ ఆశయాలను విశ్వసిస్తూ జీవితాంతం ప్రజల పక్షాన నిలిచి పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా ఆయన ఎప్పటికీ గుర్తుండిపోతారని అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి భారత రాష్ట్ర సమితి పార్టీకి మాత్రమే కాకుండా తెలంగాణ సమాజానికే తీరని లోటని కేటీఆర్ పేర్కొన్నారు. ఆయన చూపిన నిబద్ధత, ఉద్యమ స్ఫూర్తి పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తాయని చెప్పారు. పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలను స్మరించుకుంటూ ఆయన కుటుంబ సభ్యులకు కేటీఆర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఆకాంక్షించారు. చివరగా "జోహార్ పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నా" అంటూ కేటీఆర్ భావోద్వేగ నివాళి అర్పించారు. ఆయన ఆశయాలు, సేవలు తెలంగాణ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.

# పెద్ది మృతిపై కేసీఆర్ దిగ్భ్రాంతి

**హైదరాబాద్, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి):**

ఉద్యమ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతిపై భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. తానొక ఆప్త మిత్రుడిని, ఉద్యమ సహచరుడిని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేస్తూ, పెద్ది కుటుంబ సభ్యులకు, పార్టీ శ్రేణులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి భారత రాష్ట్ర సమితి అండగా ఉంటుందని కేసీఆర్ భరోసా ఇచ్చారు. ఈ క్లిష్ట సమయంలో పార్టీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. పెద్ది ప్రాణాలను కాపాడేందుకు పార్టీ చేసిన ప్రయత్నాలు, వైద్యులు చేసిన కృషి ఫలించకపోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఈ పరిణామం తనకు తీవ్ర మనోవేదన కలిగించిందని తెలిపారు. తెలంగాణనే శ్వాసగా భావిస్తూ నీతి, నిజాయతీతో ప్రజా జీవితాన్ని కొనసాగించిన నాయకుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి అని కేసీఆర్ కొనియాడారు. తెలంగాణ ఉద్యమ లక్ష్యాల సాధన కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై పనిచేసిన నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేటలో భారత రాష్ట్ర సమితి జెండాను ఎగురవేసిన ధీరుడిగా పెద్ది సుదర్శన్‌రెడ్డిని కేసీఆర్ అభివర్ణించారు. ఉద్యమ కాలం నుంచి చివరి శ్వాస వరకు గులాబీ జెండా నీడలోనే ఆయన రాజకీయ ప్రస్థానం కొనసాగిందని గుర్తు చేశారు. పార్టీ బలోపేతానికి ఆయన విశేషంగా కృషి చేశారని తెలిపారు.

# భారత్‌కు జిన్‌పింగ్ రాక?

**న్యూఢిల్లీ, జూలై 31 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):**

చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ వచ్చే సెప్టెంబర్‌లో భారత్‌లో పర్యటించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సుకు ఆయన హాజరయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పర్యటన ఖరారైతే, 2020లో గాల్వాన్ లోయలో జరిగిన భారత్–చైనా సరిహద్దు ఘర్షణ తర్వాత షీ జిన్‌పింగ్ భారత పర్యటన చేపట్టడం ఇదే తొలిసారి కానుంది. న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సుకు సభ్య దేశాల అధినేతలు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా షీ జిన్‌పింగ్ రెండు రోజుల పాటు భారతదేశంలో ఉండే అవకాశం ఉందని సమాచారం. భారత్–చైనా సంబంధాల మెరుగుదలకు ఈ పర్యటన కీలక మలుపుగా మారవచ్చని దౌత్య వర్గాలు, విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. షీ జిన్‌పింగ్ 2013 నుంచి చైనా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గత పదమూడేళ్లలో ఆయన మూడుసార్లు మాత్రమే భారత్‌ను సందర్శించారు. చివరిసారిగా 2019 అక్టోబర్‌లో మహాబలిపురంలో జరిగిన అనౌపచారిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం 2020లో గాల్వాన్ లోయలో జరిగిన ఘర్షణలతో ఇరు దేశాల మధ్య సంబంధాలు ఉద్రిక్తంగా మారాయి. సరిహద్దు వివాదం కారణంగా దౌత్య, సైనిక స్థాయిలో పలుమార్లు చర్చలు జరిగినప్పటికీ, సంబంధాలు పూర్తిగా సాధారణ స్థితికి చేరుకోలేదు. షీ జిన్‌పింగ్ పర్యటనకు ముందు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ చైనాలో పర్యటించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# నాలుగంతస్తుల భవనం నేలమట్టం

**ముంబై, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి):**

మహారాష్ట్రలోని ముంబై సమీపంలోని భీవండిలో గురువారం అర్ధరాత్రి జరిగిన విషాద ఘటనలో నాలుగంతస్తుల భవనం కుప్పకూలి తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనతో ఆ ప్రాంతంలో తీవ్ర విషాదం నెలకొంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, విపత్తు నిర్వహణ బృందాలు వెంటనే సహాయక చర్యలు చేపట్టాయి. ప్రమాదానికి గురైన భవనంలో మొత్తం నాలుగు అంతస్తులు ఉండగా, ప్రతి అంతస్తులో 12 గదుల చొప్పున మొత్తం 48 గదులు ఉన్నాయి. భవనం శిథిలావస్థకు చేరిందని గుర్తించిన మున్సిపల్ అధికారులు ఇటీవలే మరమ్మతు పనులు ప్రారంభించారు. ఈ పనులు కొనసాగుతున్న సమయంలోనే భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ప్రమాదానికి కొద్ది గంటల ముందే భవనం నుంచి విరిగి పడుతున్న శబ్దాలు వినిపించడంతో స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన అధికారులు భవనంలో నివసిస్తున్న కొన్ని కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మిగిలిన వారిని బయటకు తీసుకువచ్చే ప్రయత్నాలు కొనసాగుతుండగానే భవనం కూలిపోవడంతో ఈ ఘోర ప్రమాదం జరిగింది. భవనం కూలిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసు బృందాలు, విపత్తు నిర్వహణ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు.

# విదేశీ ఉద్యోగాలపై సీఎం కీలక ఆదేశాలు

**మొదటిపేజీ తరువాయి**

మానవ వనరుల సంస్థలతో ఒప్పందాలు కుదుర్చి ఉద్యోగులకు రక్షణ కల్పించాలని, విదేశాల్లో సమస్యలు ఎదురైతే వారికి న్యాయం జరిగేలా వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. విదేశాలకు కార్మికులను పంపిస్తున్న ఏజెంట్ల వివరాలను నమోదు చేయాలని, వారి ద్వారా వెళ్లే ప్రతి వ్యక్తి సమాచారం ప్రభుత్వ వద్ద ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వ్యవహారాల పర్యవేక్షణ కోసం తెలంగాణ విదేశీ మానవ వనరుల సంస్థకు మాజీ విదేశాంగ సేవల అధికారిని ప్రధాన కార్యనిర్వాహక అధికారిగా నియమించాలని ప్రతిపాదించారు. విదేశీ ఉద్యోగాలకు వెళ్లే వారికి తేలికపాటి, భారీ వాహనాల నడపడంలో ప్రత్యేక శిక్షణ అందించాలని చెప్పారు. యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయంలో పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జర్మన్, జపనీస్, కొరియన్, చైనీస్, రష్యన్ తదితర విదేశీ భాషల బోధన కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని, ఆయా దేశాల నుంచి శిక్షకులను ఆహ్వానించి శిక్షణ అందించాలని సూచించారు. బ్లూ కాలర్ ఉద్యోగాలకు శిక్షణ పొందే వారికి కూడా ఉపకార వేతనాల కల్పనపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు, పారిశ్రామిక శిక్షణ సంస్థలు, ఆధునిక శిక్షణ కేంద్రాలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ప్రముఖ సంస్థల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. చదువుతో పాటు శిక్షణ పొందడం ద్వారా విద్యార్థులకు ఉపకార వేతనం లభించడంతో పాటు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు పెరుగుతాయని పేర్కొన్నారు. విద్యుత్ వాహనాల మరమ్మతు సేవలు, డ్రోన్ సాంకేతికతకు సంబంధించిన కోర్సులను ఆధునిక శిక్షణ కేంద్రాల్లో ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దేశీయంగానే కాకుండా విదేశాల్లోనూ నర్సింగ్ సేవలకు భారీ డిమాండ్ ఉన్నందున అవసరాలకు అనుగుణంగా నర్సింగ్ కళాశాలలకు అనుమతులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. యువతకు ప్రపంచ స్థాయి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా నైపుణ్యాభివృద్ధి రంగంలో సమగ్ర మార్పులు తీసుకురావాలని అధికారులకు స్పష్టం చేశారు.

# టీఆర్ టీయూ లోగో ఆవిష్కరణ

- **కార్మికుల హక్కుల పరిరక్షణే టీఆర్ టీయూ లక్ష్యమని వెల్లడి**
- **రాష్ట్రవ్యాప్తంగా కార్మిక సమస్యలపై ఉద్యమిస్తామని ప్రకటన**
- **కోటిన్నర మంది కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని స్పష్టం**

**హైదరాబాద్, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణ రక్షణ ట్రేడ్ యూనియన్ (టీఆర్ టీయూ) లోగోను బంజారాహిల్స్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం టీఆర్ టీయూ పనిచేస్తుందని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలోని కోటిన్నర మంది కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వారి హక్కుల సాధన కోసం ట్రేడ్ యూనియన్ ఉద్యమిస్తుందని కవిత తెలిపారు. అసంఘటిత, సంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కృషి చేస్తామని చెప్పారు. కార్మికులు ఎదుర్కొంటున్న వేతనాలు, ఉపాధి భద్రత, సామాజిక రక్షణ, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై టీఆర్ టీయూ ప్రత్యేకంగా పనిచేస్తుందని ఆమె వివరించారు. కార్మిక వర్గం బలోపేతమే రాష్ట్ర అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. కార్మికులకు అవసరమైన చట్టపరమైన రక్షణ కల్పించడం, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, హక్కుల పరిరక్షణ కోసం ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడడం టీఆర్ టీయూ ప్రధాన లక్ష్యమని కవిత స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వివిధ రంగాలకు చెందిన కార్మికులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి వారి సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్మిక సంఘాల బలోపేతానికి టీఆర్ టీయూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. టీఆర్ టీయూ ఆవిర్భావంతో కార్మికుల హక్కుల పరిరక్షణకు కొత్త వేదిక ఏర్పడిందని, రాష్ట్రవ్యాప్తంగా కార్మిక సంక్షేమం కోసం ఉద్యమాన్ని విస్తృతం చేయనున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు.

# హైడ్రాపై హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి):**

లోతుకుంట భూముల వివాదానికి సంబంధించిన కేసులో హైడ్రా, శాంత శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ సంస్థ మధ్య కొనసాగుతున్న వ్యవహారాన్ని విచారించిన హైకోర్టు, గతంలో ఇచ్చిన ఉత్తర్వులను రంగనాథ్ స్పష్టంగా ఉల్లంఘించినట్లు పేర్కొంది. వివాదాస్పద భూమిలో యంత్రాలు, సిబ్బందితో ప్రవేశించడం న్యాయస్థానం ఆదేశాలకు విరుద్ధమని తేల్చిచెప్పింది. ఇదే కేసులో రంగనాథ్ కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు గతంలోనే హైకోర్టు అభిప్రాయపడింది. న్యాయస్థానం ఉత్తర్వులను అమలు చేయాల్సిన అధికారులు వాటిని పాటించకుండా వ్యవహరించడం చట్టబద్ధ పాలనకు విరుద్ధమని వ్యాఖ్యానించింది. విచారణ సందర్భంగా టాటా మోహన్‌రావు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు ప్రస్తావించింది. దేశంలో చట్టబద్ధమైన పాలన మాత్రమే కొనసాగాలని, ప్రతి అధికారి న్యాయస్థానాల ఆదేశాలను తప్పనిసరిగా గౌరవించాలని స్పష్టం చేసింది. వ్యక్తుల ఆధిపత్యం చట్టపరమైన వ్యవస్థపై పైచేయి సాధించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హైకోర్టు తీవ్రంగా వ్యాఖ్యానించింది. చట్టం ముందు అందరూ సమానమేనని, న్యాయస్థానాల ఉత్తర్వులను ఉల్లంఘించే చర్యలను ఏమాత్రం సహించబోమని హెచ్చరించింది. రంగనాథ్ స్థానంలో కొత్త అధికారిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు, ఈ నిర్ణయాన్ని త్వరితగతిన అమలు చేయాలని స్పష్టం చేసింది. ఈ తీర్పు అధికార యంత్రాంగంలో న్యాయస్థానాల ఆదేశాల అమలుకు ఉన్న ప్రాధాన్యాన్ని మరోసారి చాటిచెప్పింది.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**హైదరాబాద్, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి):**

మాదకద్రవ్యాలు వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబ భవిష్యత్తును కూడా నాశనం చేస్తాయని హెచ్చరించారు. మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'నషా ముక్త్ భారత్ అభియాన్' ప్రతిజ్ఞలో 10 కోట్ల మంది పాల్గొనే కార్యక్రమానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని సీతక్క విజ్ఞప్తి చేశారు. ఈ ఉద్యమం ద్వారా మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించవచ్చని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని పేర్కొన్న ఆమె, ఈ వ్యసనానికి బానిసైన వారిని చిన్నచూపు చూడకుండా తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి సమాజం సహకరించాలని సూచించారు. వ్యసన విముక్తి కోసం ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని కోరారు. ప్రతి కుటుంబం, విద్యాసంస్థ, సమాజం కలిసి మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని సీతక్క అన్నారు. యువతలో చైతన్యం పెంచడం ద్వారా వ్యసనాలను అరికట్టవచ్చని, అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. మాదకద్రవ్యాలపై అవగాహన పెంచడం, వాటి దుష్పరిణామాలను ప్రజలకు వివరించడం, వంటి చర్యలు సమాంతరంగా సాగాలని ఆమె అభిప్రాయపడ్డారు.

# భద్రాచలం వద్ద ఉగ్ర గోదావరి

**భద్రాచలం, జూలై 31 ( నవజ్యోతి ప్రతినిధి):**

పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. భారీ వరదల కారణంగా భద్రాచలం వద్ద కల్యాణకట్ట, స్నాన ఘట్టాలు పూర్తిగా నీటమునిగాయి. సాయంత్రానికి నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వరద ఉద్ధృతి కొనసాగుతున్న నేపథ్యంలో గోదావరి పరివాహక ప్రాంతాల్లోని పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. వరద ప్రభావం ఎక్కువగా ఉండే లంక గ్రామాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను జిల్లా యంత్రాంగం అప్రమత్తం చేసింది. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించేందుకు రెవెన్యూ, పోలీసు, విపత్తు నిర్వహణ బృందాలు సిద్ధంగా ఉన్నాయి. గోదావరి నది వద్దకు ఎవరూ వెళ్లరాదని, నదిలో స్నానాలు చేయడం, పడవ ప్రయాణాలు చేపట్టరాదని అధికారులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు తెలంగాణలో కురుస్తున్న విస్తారమైన వర్షాలతో రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలు నిండుకుండలా మారాయి. శ్రీరాంసాగర్, మిడ్‌మానేరు, సింగూరు, ఎల్లంపల్లి, జూరాల ప్రాజెక్టులకు భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో ఆయా ప్రాజెక్టుల నుంచి అవసరాన్ని బట్టి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కాళేశ్వరం వద్ద కూడా గోదావరి నీటిమట్టం 11.29 మీటర్లకు చేరి ప్రమాద స్థాయికి చేరువలో ప్రవహిస్తోంది. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో వరద పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# కొండాపూర్ ఫెన్సింగ్‌పై హైడ్రా వివరణ

### సర్వే నంబరు 60లోకి ప్రవేశించలేదని హైడ్రా స్పష్టం

**హైదరాబాద్, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి):**

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ గ్రామంలోని సర్వే నంబరు 59లో చేపట్టిన ఫెన్సింగ్ చర్యలపై హైడ్రా వివరణ విడుదల చేసింది. ప్రభుత్వ భూమిని పరిరక్షించాలంటూ రెవెన్యూ అధికారులు చేసిన విజ్ఞప్తి, అందించిన సమాచారం ఆధారంగానే ఫెన్సింగ్ చేపట్టినట్లు పేర్కొంది. ఈ చర్యలు పూర్తిగా రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలోనే జరిగాయని స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పు ప్రకారం సర్వే నంబరు 59లోని భూమి ప్రభుత్వానికి చెందినదిగా గుర్తించబడిన నేపథ్యంలో దాదాపు 19 ఎకరాల భూమికి రక్షణగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు హైడ్రా తెలిపింది. ఆర్డీవో, తహసీల్దార్, సర్వేయర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల సమక్షంలో, పోలీసు బందోబస్తు మధ్య ఈ ప్రక్రియ నిర్వహించినట్లు వెల్లడించింది. రెవెన్యూ అధికారులు గుర్తించిన హద్దుల మేరకే ఫెన్సింగ్ చేపట్టామని, హైడ్రా స్వతంత్రంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని స్పష్టం చేసింది. ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్డు తొలగించడంతో పాటు అక్కడ పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను కూడా తొలగించినట్లు తెలిపింది. సర్వే నంబరు 60లోకి హైడ్రా ప్రవేశించలేదని ప్రకటనలో పేర్కొంది. సర్వే నంబరు 60లో తన స్థలానికి చెందిన ప్రహరీని కూల్చివేశారని ఆరోపిస్తూ పి. సుధారాణి న్యాయస్థానాన్ని ఆశ్రయించిన నేపథ్యంలో పలు మాధ్యమాల్లో వచ్చిన కథనాలపై ఈ వివరణ ఇచ్చినట్లు తెలిపింది. సర్వే నంబరు 60లో తనకు స్థలం ఉందని పేర్కొన్న మహిళ ఆక్రమణలు తొలగించే ముందు గానీ, తర్వాత గానీ హైడ్రాను సంప్రదించలేదని, ఎలాంటి ఫిర్యాదు కూడా అందలేదని హైడ్రా వెల్లడించింది. రెవెన్యూ అధికారులు చూపించిన సరిహద్దుల మేరకే చర్యలు చేపట్టినట్లు మరోసారి స్పష్టం చేసింది. ప్రభుత్వ భూముల పరిరక్షణలో సంబంధిత రెవెన్యూ శాఖ సూచనల మేరకే హైడ్రా పనిచేస్తుందని పేర్కొంది. భూ పరిరక్షణ చర్యల్లో చట్టపరమైన విధానాలను అనుసరిస్తూ సంబంధిత అధికారుల సమక్షంలోనే అన్ని చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించింది.

# భోగాపురంపై సీఎం ఉత్సాహం

**అమరావతి, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి):**

ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నానికి ఇప్పుడు రెక్కలు వచ్చాయని, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ప్రాంత అభివృద్ధికి ముఖద్వారంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా సామాజిక మాధ్యమం ద్వారా స్పందించిన ముఖ్యమంత్రి ఈ మేరకు సందేశం విడుదల చేశారు. విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగస్టు 1న ప్రారంభించనున్నారు. ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్రలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావడం ద్వారా ఉత్తరాంధ్రలో పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాలకు కొత్త ఊతం లభిస్తుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. దేశ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి ఈ విమానాశ్రయం దోహదపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. సుమారు 7 వేల మంది పోలీసు సిబ్బందిని విధుల్లో

మోహరించారు. ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, ఇతర మౌలిక సదుపాయాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త దిశను చూపుతుందని కూటమి నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పారిశ్రామిక పెట్టుబడులు, పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్న ఈ అంతర్జాతీయ విమానాశ్రయం రాష్ట్ర మౌలిక సదుపాయాల రంగంలో కీలక ఘట్టంగా నిలవనుందని ప్రభుత్వం పేర్కొంటోంది. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇది బలమైన పునాది అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఇండస్ట్రీ కారిడార్లు...
# ఉనికి కోల్పోతున్న పల్లెలు!

- అభివృద్ధి పేరుతో రైతు భూములకు గండి... పల్లెల ఉనికిపై పెరుగుతున్న ఆందోళనలు...

**నవజ్యోతి ఎడిటోరియల్, జూలై 31**




దేశం పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలి. పెట్టుబడులు రావాలి. యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలి. ప్రపంచ దేశాలతో పోటీపడే స్థాయిలో భారతదేశం ఎదగాలి. ఇందులో ఎలాంటి భిన్నాభిప్రాయం లేదు. అయితే ఈ అభివృద్ధి కోసం పచ్చని పంట పొలాలు పరిశ్రమలకు మారిపోతూ, పల్లెలు తమ అసలు రూపాన్ని కోల్పోతూ, రైతు తన భూమిని కోల్పోయి వలస కూలీగా మారాల్సి వస్తే, ఆ అభివృద్ధి ఎవరి కోసం అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతోంది. రైతుకు భూమి అంటే కేవలం ఒక ఆస్తి కాదు. అది జీవనాధారం. అది ఆత్మగౌరవం. అది కుటుంబ భవిష్యత్తు. తరతరాలుగా సాగు చేసిన భూమిని కోల్పోయిన తర్వాత ఇచ్చే పరిహారం కొంతకాలం ఆదుకుంటుంది. కానీ భూమి ఇచ్చే శాశ్వత భరోసాను ఏ పరిహారం భర్తీ చేయలేదు. అందుకే రైతు భూమి కోసం పోరాడేది డబ్బు కోసం కాదు... తన ఉనికి కోసం. ఒకప్పుడు సొంత ఊరిలో సొంత భూమిపై రాజులా జీవించిన రైతులు, నేడు అదే భూమిపై నిర్మించిన పరిశ్రమల్లో కాంట్రాక్టు కార్మికులుగా, సెక్యూరిటీ గార్డులుగా, దినసరి కూలీలుగా పనిచేస్తున్న దృశ్యాలు దేశంలోని అనేక ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. భూమికి యజమానిగా ఉన్న వ్యక్తి, అదే భూమిపై ఉద్యోగం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి రావడం అభివృద్ధి నమూనాపై ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతోంది. భూమి కోల్పోయిన రైతు కేవలం భూమినే కాదు... తన స్వయం ఉపాధిని, ఆత్మవిశ్వాసాన్ని, గ్రామంతో ఉన్న అనుబంధాన్ని కూడా కోల్పోతున్నాడు. దేశంలో భూసేకరణకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలను పరిశీలిస్తే రైతుల ఆందోళన ఎంత లోతుగా ఉందో అర్థమవుతుంది. పశ్చిమ బెంగాల్‌లోని సింగూర్, నందిగ్రామ్ ఉద్యమాలు, ఒడిశాలో నియామ్‌గిరి ఉద్యమం, మహారాష్ట్రలో రాయ్‌గఢ్ భూసేకరణ వ్యతిరేక పోరాటాలు, ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం నిర్వాసితుల సమస్య, అమరావతి రైతుల ఉద్యమం—అన్నీ ఒకే విషయాన్ని చెబుతున్నాయి. అభివృద్ధిని ప్రజలు వ్యతిరేకించడం లేదు; తమ భూమి, జీవనాధారం, భవిష్యత్తు రక్షించబడాలని కోరుతున్నారు. తెలంగాణలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. వికారాబాద్ జిల్లా లగచర్లలో భూసేకరణ ప్రతిపాదనలపై రైతులు ఆందోళనలు చేపట్టారు. రంగారెడ్డి ఫార్మా సిటీ ప్రతిపాదనల సమయంలో పర్యావరణం, కాలుష్యం, భూగర్భ జలాలు, వ్యవసాయ భూములపై ప్రజలు ప్రశ్నలు లేవనెత్తారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరులో ఫార్మా పరిశ్రమల విస్తరణకు సంబంధించి నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణల్లో కూడా స్థానికులు తమ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ నేడు ప్రపంచంలో అతిపెద్ద జనరిక్ ఔషధ తయారీ దేశాల్లో ఒకటి. ప్రపంచంలోని అనేక దేశాలకు భారత ఫార్మా పరిశ్రమలు ప్రాణాలను కాపాడే మందులను సరఫరా చేస్తున్నాయి. కాబట్టి ఫార్మా పరిశ్రమల అవసరాన్ని ఎవరూ ప్రశ్నించడం లేదు. కానీ ప్రశ్నిస్తున్నది వాటి ఏర్పాటు విధానాన్ని. సారవంతమైన వ్యవసాయ భూములే ఎందుకు? ఇప్పటికే అభివృద్ధి చేసిన పారిశ్రామిక మండలాలు, బీడు భూములు లేదా ఇతర అనుకూల ప్రాంతాలను మరింత సమర్థంగా వినియోగించలేమా? వ్యవసాయం, పర్యావరణం, పారిశ్రామికాభివృద్ధి మధ్య సమతుల్యత సాధించలేమా? ఇవే ప్రజల ప్రశ్నలు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం ఇప్పటికీ ప్రపంచంలో కోట్లాది మందికి అవసరమైన మందులు అందుబాటులో లేవు. అంటే సమస్య మందుల ఉత్పత్తి ఎక్కువ కావడం కాదు; అవి అవసరమైన ప్రాంతాలకు చేరడం, నాణ్యత, ధర, పంపిణీ వ్యవస్థ. అందువల్ల కొత్త పరిశ్రమల అవసరాన్ని తిరస్కరించడం కంటే, అవి ఎక్కడ, ఎలా, ప్రజలకు నష్టం కలగకుండా ఏర్పాటు చేయాలనే అంశంపైనే చర్చ జరగాలి. ప్రజాభిప్రాయ సేకరణలు (పబ్లిక్ హియరింగ్‌లు) ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ప్రక్రియ. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రక్రియపై అనుమానాలు పెరుగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సమావేశాల్లో ఇచ్చే హామీలు, తరువాత అమలయ్యే పనులకు పొంతన ఉండడం లేదనే భావన ప్రజల్లో కనిపిస్తోంది. కాలుష్య నియంత్రణ, వ్యర్థాల నిర్వహణ, భూగర్భ జలాల సంరక్షణ, స్థానిక ఉపాధి, పునరావాసం వంటి అంశాలపై ఇచ్చే హామీలు కాగితాలకే పరిమితం కాకుండా ఆచరణలో కనిపించాలి. ప్రజల విశ్వాసమే ఏ ప్రాజెక్టు విజయానికి అసలైన పునాది. గ్రామం అంటే కేవలం ఇళ్ల సముదాయం కాదు. చెరువులు, పంట పొలాలు, పశుసంపద, చెట్లు, దేవాలయాలు, పాఠశాలలు, బంధుత్వాలు, సంస్కృతి—ఇవన్నీ కలిసి ఒక పల్లెను నిర్మిస్తాయి. ఒక గ్రామం తన ఉనికిని కోల్పోతే కేవలం భూమి కాదు, ఒక జీవన విధానం, ఒక చరిత్ర, ఒక సంస్కృతి కూడా క్రమంగా కనుమరుగవుతాయి. వ్యవసాయ భూములు తగ్గిపోతే రేపటి ఆహార భద్రత కూడా ప్రశ్నార్థకమవుతుంది. పరిశ్రమలు దేశ ఆర్థిక వ్యవస్థకు అవసరమే. కానీ అన్నం పెట్టే భూమి కూడా అంతే అవసరం. పారిశ్రామికాభివృద్ధి పేరుతో వ్యవసాయాన్ని బలహీనపరచే విధానం దీర్ఘకాలంలో దేశానికే సవాలుగా మారే ప్రమాదం ఉంది. ప్రభుత్వాలు భూసేకరణను కేవలం పరిహారంతో ముగించకూడదు. భూమి ఇచ్చిన కుటుంబాలకు శాశ్వత జీవన భద్రత, నైపుణ్య శిక్షణ, స్థిరమైన ఉపాధి, మెరుగైన పునరావాసం, నాణ్యమైన విద్య, వైద్య సదుపాయాలు కల్పించాలి. పరిశ్రమల విజయాన్ని పెట్టుబడుల పరిమాణంతో మాత్రమే కాకుండా, ప్రజల విశ్వాసం, పర్యావరణ పరిరక్షణ, రైతుల జీవితాల్లో వచ్చిన సానుకూల మార్పులతో కూడా కొలవాలి. పరిశ్రమలు రావాలి... కానీ పల్లెలు తమ ఉనికిని కోల్పోకూడదు. పెట్టుబడులు రావాలి... కానీ రైతు కన్నీళ్లు కారకూడదు. అభివృద్ధి అంటే కాంక్రీట్ భవనాలు నిర్మించడం మాత్రమే కాదు; రైతు ఆత్మగౌరవాన్ని, పల్లె సంస్కృతిని, ప్రకృతిని కాపాడుతూ ముందుకు సాగడం. అభివృద్ధి పేరిట రైతు తన సొంత నేలపై పరాయివాడిగా మారకూడదు. పంట పండించిన చేతులు, అదే నేలపై కూలీ పనికి పరిమితం కాకూడదు. రైతును భాగస్వామిగా చేసుకున్న అభివృద్ధే నిజమైన అభివృద్ధి. భూమిని కోల్పోయిన రైతు కూలీగా కాకుండా, అభివృద్ధిలో భాగస్వామిగా నిలిచే రోజు వచ్చినప్పుడే పారిశ్రామిక ప్రగతికి అసలైన అర్థం ఉంటుంది.

**– సాయి మణికంఠ**
**మేనేజింగ్ ఎడిటర్**

## 'మై భారత్' జిల్లా స్థాయి పోటీలకు ఏర్పాట్లు పూర్తి

**యువత ప్రతిభకు వేదికగా వివిధ విభాగాల్లో పోటీలు...**

**కామారెడ్డి, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి):**




యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారి సృజనాత్మకతను ప్రోత్సహించే లక్ష్యంతో 'మై భారత్' కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన అధికారి (డీవైఓ) రమేష్, ఆర్.కే. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జైపాల్ రెడ్డి తెలిపారు. ఈ పోటీలు శుక్రవారం ఉదయం 10 గంటలకు కామారెడ్డి ఆర్.కే. డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఫోక్ సాంగ్, ఫోక్ డ్యాన్స్, రీల్/షార్ట్ ఫిల్మ్, నాటకం, కవిత్వం, డిబేట్, స్లోగన్ రైటింగ్, పెయింటింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా యూత్ ఆఫీసర్ రంగా వెంకటేశ్వర్ గౌడ్, సౌత్ క్యాంపస్ ప్రిన్సిపల్ సుధాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు అంజయ్య, హరిత పాల్గొన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ యువశక్తిని దేశ నిర్మాణానికి వినియోగించేలా అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన ఆసక్తి గల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## ఆన్‌లైన్ గేమింగ్ పేరుతో పెట్టుబడి మోసం.. ఇద్దరు అరెస్ట్

- రూ.15 వేల నగదు, ల్యాప్‌టాప్, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచన...

**కామారెడ్డి, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి):**




ఆన్‌లైన్ గేమింగ్, పెట్టుబడుల పేరుతో అమాయకులను మోసం చేస్తున్న ఇద్దరు సైబర్ నేరస్థులను కామారెడ్డి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.15 వేల నగదు, ఒక హెచ్‌పీ ల్యాప్‌టాప్, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఐపీఎస్ ఆదేశాల మేరకు, డీఎస్పీ మధుసూదన్ పర్యవేక్షణలో రూరల్ సీఐ శ్రీధర్, సీసీఎస్ సీఐ రమణ, ఎస్సై మురళి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. కామారెడ్డి బస్టాండ్ వద్ద విశాఖపట్నానికి పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా భుక్యా నవీన్ (నరేష్), భుక్యా ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో నిందితులు Future9.com పేరుతో ఆన్‌లైన్ గేమింగ్ లింకులను వాట్సాప్ ద్వారా పంపించి, పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మించి బాధితులను మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. వెబ్‌సైట్‌లో చెల్లింపులు విఫలమైనప్పుడు యూపీఐ క్యూ ఆర్ కోడ్‌ల ద్వారా నేరుగా డబ్బు తీసుకుని, వెబ్‌సైట్‌లో జమ చేస్తూ 5 శాతం కమిషన్ పొందినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా పలువురు బాధితులు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. మరో నిందితుడి కోసం గాలింపు కొనసాగుతోంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ప్రజలకు కీలక సూచనలు చేశారు. వాట్సాప్, టెలిగ్రామ్, సోషల్ మీడియా ద్వారా వచ్చే ఆన్‌లైన్ గేమింగ్, ట్రేడింగ్, పెట్టుబడులు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, క్యాష్‌బ్యాక్, రెట్టింపు లాభాల పేరుతో వచ్చే లింకులను నమ్మవద్దని హెచ్చరించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## భిక్కనూరు ఎస్సైకి టీజీవీపీ నాయకుల సన్మానం

**విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతి...**



**భిక్కనూరు, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి):**

టీజీవీపీ విద్యార్థి నాయకులు శనివారం భిక్కనూరు ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎస్సై దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు సంజయ్, కామారెడ్డి టౌన్ ఇన్‌చార్జి సమీర్, భిక్కనూరు మండల అధ్యక్షుడు భరత్, మండల ఉపాధ్యక్షుడు విజయ్, శివ, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ ప్రాణాలు కాపాడిన దోమకొండ పోలీసులు

**సమయస్ఫూర్తితో స్పందించిన హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ ను అభినందించిన ఎస్పీ..**




**దోమకొండ, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి):**

దోమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ మహిళను పోలీసులు సకాలంలో స్పందించి సురక్షితంగా కాపాడారు. డయల్-100కు సమాచారం అందిన వెంటనే హెడ్ కానిస్టేబుల్ గంగయ్య, కానిస్టేబుల్ రాజు సంఘటనా స్థలానికి చేరుకుని అప్రమత్తంగా వ్యవహరించి మహిళ ప్రాణాలను రక్షించారు. ఈ ఘటనలో విధి నిర్వహణలో సమయస్ఫూర్తి ప్రదర్శించిన హెడ్ కానిస్టేబుల్ గంగయ్య, కానిస్టేబుల్ రాజును జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వెంటనే డయల్-100కు సమాచారం అందించాలని, ప్రతి ప్రాణం అమూల్యమైనదని ఆయన సూచించారు. సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని, ఇబ్బందులు ఎదురైనప్పుడు కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా సంబంధిత అధికారుల సహాయం తీసుకోవాలని ఎస్పీ పేర్కొన్నారు.

## వర్షా నికి దెబ్బతిన్న ఇండ్లను పరిశీలించిన సర్పంచ్



**భిక్కనూర్, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి):**

భిక్కనూర్ పట్టణంలోని 11వ వార్డులో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న ఇండ్లను సర్పంచ్ రేఖ సుదర్శన్ పరిశీలించారు. బాధిత కుటుంబాలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్డు సభ్యుడు సురేష్ గౌడ్, జీపీఓ కాశిరాం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్ పాల్గొని బాధితులకు ప్రభుత్వం తరఫున తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 10న 'హాలో మాల – చలో ఢిల్లీ' కార్యక్రమం విజయవంతం చేయాలి

**బైండ్ల అశోక్ కుమార్**

**సంగారెడ్డి, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి)**

ఆగస్టు 10న ఢిల్లీలో నిర్వహించనున్న 'హాలో మాల – చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిస్తూ సంగారెడ్డి జిల్లా అంధక్షుల బ్లైండ్ ఆర్థిక్ కుమార్, మత్స్యకారులు, కాంద్రేగులపల్లి ప్రజా ప్రతినిధులు, పలువురు నాయకులు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా మాల సంఘం న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాలల సామాజిక, విద్యా, ఉపాధి హక్కుల సాధన కోసం పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సంగారెడ్డి జిల్లా నుంచి అధిక సంఖ్యలో ప్రజలు ఢిల్లీకి తరలివెళ్లేందుకు ఇప్పటికే ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పలువురు సామాజిక సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

# కశింబాబా దర్గా ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న మేడ్చల్ మాజీ జడ్పీటీసీ సాయిపేట శ్రీనివాస్



**మేడ్చల్, జులై 31( నవజ్యోతి ప్రతినిధి )**

కశింబాబా దర్గా ఉర్సు ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగావు. ఈ వేడుకల్లో మేడ్చల్ మాజీ జడ్పీటీసీ , గుండ్లపోచంపల్లి మాజీ కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కశింబాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. గుండ్లపోచంపల్లి 299 డివిజన్ ప్రజలతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ ఉర్సు ఉత్సవాల్లో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ 299 అధ్యక్షుడు కుంద భానుచందర్, లేబర్ సెల్ నాయకుడు సాయిపేట మల్లేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు వడ్డే ప్రవీణ్, గుల్బర్గా ముస్లిం పెద్దలు అజాం బాబా, శైపుల బాబా, నాచారం హుసేన్ బాబా, బొల్లారం సయెద్ హతిక్, గుండ్లపోచంపల్లి ముస్లిం నాయకులు అక్బర్ పాషా, షబ్బీర్, జాఫర్, అన్వర్, జావీద్, గౌస్, మొహమ్మద్ సాజిత్, షారుక్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

# నాంపల్లి కోర్టుకు హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్..

## భారీగా తరలివెళ్లిన మేడ్చల్ శ్రేణులు



**మేడ్చల్, జులై 31(నవజ్యోతి ప్రతినిధి )**

నాంపల్లి కోర్టులో ఈరోజు (శుక్రవారం) జరిగిన 'ఈ-ఫార్ములా' కేసుకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు సంఘీభావంగా మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని పలు డివిజన్ల నుండి గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున నాంపల్లి కోర్టుకు తరలివెళ్లారు. మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని 297, 298, 299 డివిజన్ల నుండి కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో కోర్టుకు చేరుకుని కేటీఆర్‌కు తమ పూర్తి మద్దతును ప్రకటించారు. నాయకులు, కార్యకర్తల రాకతో కోర్టు పరిసర ప్రాంతాల్లో గులాబీ శ్రేణుల సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ భాస్కర్ యాదవ్, అంకిటి నవీన్ రెడ్డి, దయానంద్ తదితర బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, స్థానిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేటీఆర్‌కు తమ సంఘీభావం తెలిపారు. కేటీఆర్‌పై కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఇటువంటి కేసులు బనయిస్తున్నారని ఈ సందర్భంగా నాయకులు అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు నాయకుడికి వెన్నంటి ఉంటాయని వారు స్పష్టం చేశారు.

# నీళ్లు తోడేశారు...సమస్యను కాదు!

- పెరిగిన జనాభాకు సరిపోని పాత డ్రైనేజీ వ్యవస్థ
- పెరిగిన కాలనీలు...కుంగిన మౌలిక వసతులు
- నీరు తొలగించిన శానిటేషన్ విభాగం...శాశ్వత పరిష్కారంపై ఇంజనీరింగ్ మౌనం



**కుత్బుల్లాపూర్, జూలై 31: (నవజ్యోతి ప్రతినిధి)**

వార్తలు వస్తే నీటిని తొలగించడం... వర్షం పడితే మళ్లీ అదే దుస్థితి. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేట గ్రామంలో డ్రైనేజీ సమస్యకు ఇదే నిత్యకథగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్ నంబర్–1 నుంచి రోడ్ నంబర్–4 వరకు సుమారు 300 మీటర్ల మేర డ్రైనేజీ నీరు, వర్షపు నీరు నిల్వ ఉండడంతో ప్రతిరోజూ విద్యార్థులు, మహిళలు, వృద్ధులు మురుగునీటిలోనే ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. వివిధ దినపత్రికల్లో సమస్యపై కథనాలు ప్రచురితమైన తర్వాత దుండిగల్ సర్కిల్ శానిటేషన్ అధికారులు స్పందించి నిల్వ నీటిని తొలగించారు. అయితే అది తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని, అసలు సమస్యకు మూలమైన డ్రైనేజీ వ్యవస్థలో ఎలాంటి మార్పు జరగలేదని స్థానికులు చెబుతున్నారు. మల్లంపేట గ్రామం గతంలో గ్రామపంచాయతీగా ఉండి, తరువాత మున్సిపాలిటీగా, ప్రస్తుతం దుండిగల్ సర్కిల్ పరిధిలోకి వచ్చినప్పటికీ, డ్రైనేజీ వ్యవస్థ మాత్రం పాత కాలంనాటి సామర్థ్యంతోనే కొనసాగుతోందని వారు పేర్కొంటున్నారు. కాలనీలు పెరిగాయి... జనాభా రెట్టింపైంది... కానీ డ్రైనేజీ పైప్‌లైన్లు మాత్రం విస్తరించలేదని అంటున్నారు. ఫలితంగా మురుగునీరు బయటకు వెళ్లక రోడ్లపైకి పొంగిపొర్లడం, వర్షపు నీరు కలవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తున్నారు. ప్రతి వర్షాకాలంలో ఇదే దృశ్యం పునరావృతం కావడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. పిల్లలు స్కూల్‌కు వెళ్లేందుకు మురుగునీటిలో నడవాల్సి రావడం, ద్విచక్రవాహనదారులు జారి పడే ప్రమాదం ఉండడం, దోమలు, దుర్వాసన, అంటువ్యాధుల భయం వెంటాడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

స్థానికుల అభిప్రాయం ప్రకారం, సమస్య శానిటేషన్ పరిధిలో కాదని, ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో డ్రైనేజీ నెట్‌వర్క్‌ను సమగ్రంగా పునర్నిర్మించాల్సిన అవసరం ఉందని అంటున్నారు. ప్రస్తుత జనాభా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొత్త డ్రైనేజీ పైప్‌లైన్లు, తగిన సామర్థ్యంతో కాలువల విస్తరణ చేపట్టినప్పుడే శాశ్వత పరిష్కారం లభిస్తుందని వారు కోరుతున్నారు.

# దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోచారం



**బాన్సువాడ, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి):**

బాన్సువాడ పట్టణ కేంద్రంలోని పాత బాన్సువాడ పల్లె దవాఖానను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానలో రోగులకు అందుతున్న వైద్య సేవలను ప్రత్యక్షంగా పరిశీలించి, వైద్య సిబ్బందితో మాట్లాడారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమయానికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. అవసరమైన మందులు, వైద్య పరికరాలు, ఇతర సదుపాయాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి, నివారణ చర్యలను మరింత పటిష్ఠంగా అమలు చేయాలని, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

# మేడ్చల్ డివిజన్‌లో అస్తవ్యస్తంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు..

## వెంటనే స్పందించాలని ఎమ్మెల్యేకు వినతి!

**మేడ్చల్, జులై 31(నవజ్యోతి ప్రతినిధి )**

మేడ్చల్ డివిజన్ పరిధిలో రోడ్లు, మురుగునీటి పారుదల (డ్రైనేజీ) వ్యవస్థ పూర్తిగా క్షీణించిందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి మేడ్చల్ డివిజన్ 297 ప్రజల తరఫున వినతిపత్రం అందజేశారు. రోడ్లు, డ్రైనేజీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డివిజన్ ప్రజలు కోరారు.



**ప్రధాన సమస్యలు ఇవే:**

నేషనల్ హైవే (న్ .ఛ్ .-44) నుంచి రైల్వే స్టేషన్ రోడ్డు మరియు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. చపాలా మార్కెట్ నుంచి జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్ వరకు రోడ్డు మరియు డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. సూర్యనగర్ కాలనీలోని (ఐ.టీ.ఐ.) కాలేజ్ రోడ్డు, డ్రైనేజీ దెబ్బతిన్నాయి. వినాయక నగర్ కాలనీ రోడ్డు నెం. 1, 2 లలో న్ ఛ్ -44 బస్ డిపో రోడ్లు, డ్రైనేజీలు పాడైపోయాయి. న్ ఛ్ -44 ముకుందా థియేటర్ నుంచి రైల్వే స్టేషన్ రోడ్డు వరకు ప్రయాణం కష్టతరంగా మారింది. బస్తీ టీచర్స్ కాలనీ రోడ్డుతో పాటు, గిర్మాపూర్‌లోని వివేకానంద విగ్రహం నుంచి హనుమాన్ ఆలయం వరకు సి.సి. రోడ్డు మరమ్మతుకు నోచుకోలేదు. మేడ్చల్ గవర్నమెంట్ హాస్పిటల్ నుంచి రైలాపూర్ వరకు బి.టి. రోడ్డు దెబ్బతింది. గ్రంథాలయ భవనం నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు రోడ్డు మరియు డ్రైనేజీ సమస్యలు ఉన్నాయి. గిర్మాపూర్ - రైలాపూర్, రైల్వే కాలనీ, మేడ్చల్ ప్రాంతాలలో స్ట్రీట్ లైట్లు, పారిశుద్ధ్య లోపం తీవ్రంగా ఉంది. బస్ డిపో వద్ద పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా క్షీణించిందని, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

**గ్రంథాలయం నుంచి ఇందిరా నగర్ కాలనీ రోడ్డు దుస్థితి:**

గ్రంథాలయం నుంచి ఇందిరా నగర్ కాలనీ హౌసింగ్ బోర్డు కాలనీ వరకు డ్రైనేజీ కోసం రోడ్డును తవ్వి పైపులైన్ వేశారు. అయితే ఆ తర్వాత రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడంతో అది పూర్తిగా గుంతలమయంగా, వర్షపు నీటితో నిండిపోయింది. న్ ఛ్ -44 నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే ప్రధాన మార్గం ఇదే కావడంతో.. నిత్యం పాఠశాల బస్సులు, ఆటోలు, బైక్‌లతో పాటు గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలు ఇదే మార్గంలో ప్రయాణించాల్సి వస్తోంది. గతంలో మున్సిపాలిటీగా ఉన్నప్పుడు ప్రారంభమైన డ్రైనేజీ పనులు, ఇప్పుడు జిహెచ్ఎంసి ఏర్పడినప్పటికీ రోడ్డు మాత్రం పూర్తిస్థాయిలో మరమ్మతుకు నోచుకోలేదు. ఈ మార్గంలో అధికారులూ, ప్రజాప్రతినిధులు వెళ్తున్నప్పటికీ రోడ్డు దుస్థితి మాత్రం మారడం లేదని స్థానికులు వాపోతున్నారు. తక్షణమే స్పందించి ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డివిజన్ ప్రజలు మల్లారెడ్డి ని కలిసి వినతిపత్రం అందజేశారు.

# వికసిత్ భారత్ కోసం నషా ముక్త యువ..

## మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా స్థాయి పోటీలు విజయవంతం

**మేడ్చల్, జులై 31(నవజ్యోతి ప్రతినిధి )**

నషా ముక్త భారత్ అభియాన్లో భాగంగా "వికసిత్ భారత్ కోసం నషా ముక్త యువ" అనే నినాదంతో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలు కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ (సీఎంర్టీసీ)లో అత్యంత వైభవంగా ముగిశాయి. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన 'మై భారత్' సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

**ఉత్సాహంగా విద్యార్థుల ప్రదర్శనలు**

జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ విద్యా సంస్థల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

జానపద సంగీతం, జానపద నృత్యం నుక్కడ్ నాటక్/మైమ్, చిత్రలేఖనం వాదోపవాదం/ఉపన్యాసం, షార్ట్ ఫిల్మ్/రీల్స్ నాద రచన, స్లామ్ పోయెట్రీ వంటి విభిన్న విభాగాల్లో యువత తమ కళాత్మక ప్రతిభను చాటుకున్నారు. మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం మరియు వికసిత్ భారత్ రూపకల్పనలో యువత పాత్ర ఎంత కీలకమో తమ ప్రదర్శనల ద్వారా అద్భుతంగా కళ్లకు కట్టారు. సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ చైర్మన్ సి. గోపాల్ రెడ్డి, డైరెక్టర్ డా. ఏ. రాజి రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీన్లు, హెచ్ఓడీలు మరియు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సాహుల్ ఈ కార్యక్రమ సమన్వయంలో కీలక పాత్ర పోషించి విజయవంతం చేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా'మై భారత్' డిప్యూటీ డైరెక్టర్ స్నేహల్ ధ్యానేశ్వర్ బసుత్కర్ మాట్లాడుతూ.. దేశాభివృద్ధి ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన యువత చేతుల్లోనే ఉందన్నారు. యువత మై భారత్ పోర్టల్ ద్వారా దేశ నిర్మాణ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని, ప్రతి ఒక్కరూ 'నషా ముక్త భారత్ అభియాన్'కు రాయబారిగా మారి సమాజంలో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.



**విజేతల వివరాలు**

వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు అతిథులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జానపద నృత్యం దినేష్ మరియు బృందం (మొదటి స్థానం) జానపద సంగీతం: చి. సాయి కృష్ణ మరియు బృందం (మొదటి స్థానం) నుక్కడ్ నాటక్: సంపన్న మరియు బృందం (మొదటి స్థానం) ఈ జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రతిభావంతులు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని నిర్వాహకులు తెలిపారు. మాదకద్రవ్యాల నిషేధ సందేశాన్ని కళల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఈ వేడుక ఒక మైలురాయిగా నిలిచింది.

# పోలింగ్ కేంద్రాలపై రాజకీయ పార్టీలతో ప్రత్యేక సమావేశం

- ఓటర్ల సౌకర్యమే అజెండా..పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణకు శ్రీకారం
- ఓటు కేంద్రాల మ్యాప్ మారనుందా?..ఎస్ఐఆర్ లో కీలక చర్చ



**కుత్బుల్లాపూర్, జూలై 31: (నవజ్యోతి ప్రతినిధి)**

045 కుత్బుల్లాపూర్ అసెంబ్లీ గాజులరామారం సర్కిల్ పరిధిలో ( సార్ ) కార్యక్రమంలో భాగంగా ఏఈఆర్ఓ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, అవసరమైన చోట పోలింగ్ కేంద్రాల స్థాన మార్పు వంటి అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చ జరిగింది. ప్రజలకు మరింత చేరువగా, సౌకర్యవంతంగా పోలింగ్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావడమే ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని అధికారులు వివరించారు. ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాలపై ఏవైనా అభ్యంతరాలు, స్థాన మార్పు అవసరం, కొత్త కేంద్రాల ఏర్పాటు లేదా మౌలిక సదుపాయాల మెరుగుదలకు సంబంధించిన ప్రతిపాదనలు ఉంటే, వాటిని సరైన కారణాలతో లిఖితపూర్వకంగా సమర్పించాలని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలు, స్థానిక పరిస్థితులను వివరించగా, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ప్రతి సూచనను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా, పారదర్శకంగా మరియు సమర్థవంతంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించేందుకు ఈ హేతుబద్ధీకరణ చర్యలు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏఈఆర్ఓ&డిప్యూటీ కమిషనర్ యు.వెంకటరాములు, ఎలెక్షన్ సూపరింటెండెంట్ బి. బాలకృష్ణతో పాటు వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో వచ్చిన సూచనలను ఎన్నికల సంఘానికి పంపించనున్నట్లు అధికారులు తెలిపారు.

# ఆదర్శంగా నిలిచిన సీఐ గడ్డం మల్లేశ్ రక్తదానం

**బాలనగర్, జూలై 31(టి రాజగోపాల్ బాలానగర్) :**

సమాజంలో రక్తదానంపై అవగాహన కల్పిస్తూ, యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు సీఐ గడ్డం మల్లేశ్. ఆయన తన పుట్టినరోజును పురస్కరించుకుని మరోసారి రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. గత ఏడేళ్లుగా ప్రతి సంవత్సరం తన పుట్టినరోజున రక్తదానం చేయడాన్ని ఆయన ఒక సాంప్రదాయంగా కొనసాగిస్తుండటం విశేషం. ఇందులో భాగంగానే శుక్రవారం బాలానగర్‌లోని 'నందిని రక్తనిధి కేంద్రం' (బ్లడ్ బ్యాంక్) లో ఆయన రక్తదానం చేశారు. రక్తదానం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ యువతను ఈ మంచి కార్యం వైపు ప్రోత్సహిస్తున్నారు. గతంలో ఆయన జీడిమెట్ల సీఐగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఏకంగా 423 యూనిట్ల రక్తాన్ని సేకరించి ఎందరో ప్రాణాలను కాపాడారని, ఆయనొక ప్రాణదాత అని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.

# ఘనంగా పదవీ విరమణ సన్మాన కార్యక్రమం

- ఏడుగురు పోలీసు అధికారులకు సీపీ బి. సుమతి, ఐపీఎస్ ఘన వీడ్కోలు – సేవలకు ప్రశంసలు



**కుషాయిగూడ, జూలై 31,(నవజ్యోతి ప్రతినిధి):**

మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్‌లో పదవీ విరమణ పొందిన ఏడుగురు పోలీసు అధికారులకు కమిషనర్ శ్రీమతి బి. సుమతి, ఐపీఎస్ చేతుల మీదుగా ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. విధి నిర్వహణలో విశిష్ట సేవలందించిన అధికారులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పోలీసు శాఖలో పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, సమాజానికి సేవ చేసే అవకాశాలకు అంతం కాదన్నారు. పదవీ విరమణ పొందిన ఎస్ఐలు పి. ముత్తయ్య, ఎం. శ్రీనివాస్, డి. సుధాకర్, అసిస్టెంట్ రిజర్వ్ సబ్ఇన్‌స్పెక్టర్లు టి.వి. చల్మయ్య, ఆర్. పాండురంగం, సయ్యద్ హస్మత్, అసిస్టెంట్ సబ్ఇన్‌స్పెక్టర్ కె. గోపాల్ అందించిన సేవలు పోలీసు శాఖకు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన పెన్షన్, గ్రాట్యుటీ, ఇతర పదవీ విరమణ ప్రయోజనాలు ఎలాంటి జాప్యం లేకుండా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతూ, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, తమ అనుభవాన్ని సమాజ సేవకు వినియోగించాలని సూచించారు.అనంతరం పదవీ విరమణ చేసిన అధికారుల కుటుంబ సభ్యులు, సహచరులు హాజరై వారికి ఆప్యాయంగా వీడ్కోలు పలకడంతో కార్యక్రమం భావోద్వేగభరితంగా సాగింది.ఈ కార్యక్రమంలో డీసీపీ (అడ్మిన్) ఇందిర, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ నరసింహారెడ్డి, ఏసీపీ స్పెషల్ బ్రాంచ్ రవీంద్రరెడ్డి, సీఏవోలు శ్రీనివాస్, శ్రీనివాస్, పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్. భద్రారెడ్డి తదితరులు పాల్గొని పదవీ విరమణ చేసిన అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

# జియాపల్లి–ఉప్పల్‌కు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

- చెంగిచెర్ల డిపో మేనేజర్‌కు ఏనుగు సుదర్శన్ రెడ్డి వినతిపత్రం



**ఉప్పల్, జూలై 3, (నవజ్యోతి ప్రతినిధి) :**

జియాపల్లి నుంచి ఔషపూర్ మీదుగా ఉప్పల్ వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి చెంగిచెర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్. స్వాతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, జియాపల్లి, జమ్మిలాపేట్, ఔషపూర్ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు, ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉపాధి కోసం ప్రతిరోజూ ప్రయాణించే వారు ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి రావడంతో వారి రోజువారీ ఆదాయంలో గణనీయమైన భాగం రవాణా ఖర్చులకే వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.జియాపల్లి నుంచి ఔషపూర్ మీదుగా ఉప్పల్ వరకు ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభిస్తే వేలాది మంది ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన డిపో మేనేజర్ ఎస్. స్వాతి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ బీసీ సంఘం ఉపాధ్యక్షులు, అఖిల భారత రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మరాజు సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కూరగాయల మార్కెట్‌లో అక్రమాలపై విజిలెన్స్ విచారణకు డిమాండ్

- అక్రమంగా చేతులు మారిన దుకాణాల కేటాయింపులు రద్దు చేయాలి – స్థానిక నిరుద్యోగ యువతకు అవకాశం కల్పించాలి

**కుషాయిగూడ, జూలై 31,(నవజ్యోతి ప్రతినిధి) :**

కుషాయిగూడ కూరగాయల మార్కెట్‌లో జరుగుతున్న దుకాణాల అక్రమ బదిలీలు, ఒకే వ్యక్తి పేరుపై బహుళ దుకాణాలు, అనధికార వ్యాపారాలు, రైతుల వద్ద అక్రమ వసూళ్లు, అద్దె, విద్యుత్ బకాయిలు తదితర అంశాలపై సమగ్ర విజిలెన్స్ విచారణ జరిపించాలని కోరుతూ కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ జోనల్ కమిషనర్, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్‌లకు వినతిపత్రం సమర్పించింది. మార్కెట్‌లో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన దుకాణాల బదిలీలను గుర్తించి, అక్రమ కేటాయింపులను రద్దు చేయడంతో పాటు ఖాళీ అయ్యే దుకాణాలను పారదర్శక విధానంలో కుషాయిగూడకు చెందిన పేద నిరుద్యోగ యువతకు కేటాయించాలని అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. అలాగే రైతుల వద్ద జరుగుతున్న అక్రమ వసూళ్లను అరికట్టి, ప్రభుత్వ ఆదాయానికి జరుగుతున్న నష్టంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరింది.ఈ కార్యక్రమంలో కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పనగట్ల చక్రపాణి గౌడ్, రేగొండ వెంకటేశ్వర్లు, కొడకండ్ల యాదయ్య, పండాల గణేష్ గౌడ్, చినంగిని దయానంద్, పిట్టల రాజు ముదిరాజ్, దూసరి శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




# కడేకల్, టేకులగూడెం గ్రామాల్లో ముందస్తు ఆరోగ్య శిబిరాలు

**వాజేడు(నవ జ్యోతి ప్రతినిధి). జూలై 31.**

వాజేడు మండలంలోని పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కడేకల్ మరియు టేకులగూడెం గ్రామాలలో గోదావరి వరదల నేపథ్యంలో ప్రజల ఆరోగ్య రక్షణ కోసం వైద్యాధికారి డాక్టర్ భాస్కర్ ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు ఆరోగ్య శిబిరాలు నిర్వహించబడ్డాయి. ఈ శిబిరాలలో వరదల అనంతరం సంభవించే ఆరోగ్య సమస్యలు, సీజనల్ వ్యాధుల నివారణ, తాగునీటి పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు. అంతేకాకుండ ప్రత్యేకంగా గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, రక్తపోటు, హిమోగ్లోబిన్, గర్భస్థ శిశువు ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. అలాగే అవసరమైన ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందజేసి, సమతుల్య పోషకాహారం తీసుకోవడం, శుభ్రమైన నీరు తాగడం, వరద నీటిలో నడవకుండా జాగ్రత్తలు పాటించడం, ప్రమాద సూచనలు కనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు, టైఫాయిడ్, అతిసారం (డయేరియా), కలరా, లెప్టోస్పిరోసిస్ వంటి వరదల అనంతరం ఎక్కువగా వచ్చే వ్యాధుల లక్షణాలు, నివారణ చర్యలపై ప్రజలకు వివరించారు. ముఖ్యంగా ప్రజలకు ఇచ్చిన ప్రధానమైన సూచనలు, మరిగించి చల్లార్చిన లేదా శుద్ధి చేసిన తాగునీటినే ఉపయోగించాలి. ఆహారాన్ని తాజాగా వండి వేడిగా తీసుకోవాలి. నిల్వ నీరు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి.దోమల నివారణకు దోమతెరలు,



దోమల నివారణ సాధనాలు ఉపయోగించాలి చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలి.జ్వరం, వాంతులు, విరేచనాలు లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందాలనీ సూచనలు చేశారు.అనంతరం డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ, గోదావరి వరదల సమయంలో ప్రజలు ఆరోగ్యపరంగా అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం సూచిస్తున్న అన్ని జాగ్రత్తలు పాటించాలని, అవసరమైతే ఆరోగ్య శాఖ సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు.ఈయొక్క కార్యక్రమంలో ఆరోగ్య uh శాఖ సిబ్బంది, HEO వేణుగోపాలకృష్ణ,ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థులపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది

- వైఎస్సార్‌సీపీ ఆరోపణలు అవాస్తవం: టీడీపీ సోషల్ మీడియా ప్రతినిధి రెడ్డి వీరబాబు

**ముమ్మిడివరం, జులై 31 (నవజ్యోతి ప్రతినిధి):**

విద్యార్థుల భవిష్యత్తుపై కూటమి ప్రభుత్వానికి పూర్తి చిత్తశుద్ధి ఉందని, ఈ అంశంపై వైఎస్సార్‌సీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవి, నిరాధారమైనవని టీడీపీ సోషల్ మీడియా ప్రతినిధి రెడ్డి వీరబాబు పేర్కొన్నారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం రాష్ట్ర అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడం పూర్తిగా పరిపాలనా, భద్రతాపరమైన కారణాలతో తీసుకున్న నిర్ణయమేనని స్పష్టం చేశారు. ఆ నిర్ణయాన్ని విద్యార్థుల



భవిష్యత్తుతో ముడిపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధ్యతారాహిత్యమని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేయడం మానుకుని, రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని వైఎస్సార్‌సీపీ నాయకులకు రెడ్డి వీరబాబు సూచించారు.

# నానాజీపూర్‌లో 'వన మహోత్సవం'



- మొక్కలు నాటిన సర్పంచ్ మైలారం సురేఖ రాజు కార్యదర్శి జోత్స్న

**రాజేంద్రనగర్ జులై 31 (నవ జ్యోతి ప్రతినిధి )**

శంషాబాద్ మండల పరిధిలోని నానాజీపూర్ గ్రామంలో 'వన మహో వం' కార్యక్రమాన్ని శుక్రవారం గ్రామ సర్పంచ్ మైలారం సురేఖ రాజు గ్రామ కార్యదర్శి బి. జ్యోత్స్న లు నిర్వహించారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో గ్రామస్థులతో కలిసి 500 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మైలారం సురేఖ రాజు,గ్రామ కార్యదర్శి బి. జ్యోత్స్న మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ, గ్రామాన్ని హరితమయంగా మార్చడమే లక్ష్యంగా ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. గ్రామంలో మొత్తం 6,000 మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని. అందులో భాగంగానే నేడు ఈ కార్యక్రమం నిర్వహించామని వెల్లడించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను గ్రామస్థులందరూ తీసుకోవాలని, పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గృహకల్ప యువతకు ఐటీ రంగంలో ఉచిత శిక్షణ

## ఉద్యోగావకాశాల కల్పన

**కీసర, జూలై 31,(నవజ్యోతి ప్రతినిధి) :**

కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో యువతకు ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఫ్రెష్‌వర్క్స్ ఐటీ కంపెనీ మరియు ఎడ్‌నెట్ ఫౌండేషన్ సంయుక్తంగా తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత ( సిఎస్ఆర్ ) కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ఈ కార్యక్రమంలో ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు, డిగ్రీ మధ్యలో నిలిపివేసిన వారు, డిగ్రీ పూర్తి చేసిన యువత పాల్గొనే అవకాశం కల్పించారు. ఎంపికైన అభ్యర్థులకు సీఎంఆర్ క్యాంపస్‌లో 15 నెలల పాటు పూర్తిగా ఉచితంగా ఫుల్ స్టాక్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ అందించనున్నారు. శిక్షణ పొందే ప్రతి అభ్యర్థికి రూ.72,000 స్కాలర్‌షిప్, ఆన్–ది–జాబ్ ట్రైనింగ్, ట్రైనింగ్ సర్టిఫికేట్తో పాటు ఉద్యోగ అవకాశం కూడా కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రవేశ పరీక్షకు ఎలాంటి ఫీజు ఉండదని, దరఖాస్తుల స్వీకరణ చివరి తేదీ ఆగస్టు 3 అని వెల్లడించారు. ఈ అవకాశాన్ని రాజీవ్ గృహకల్ప కాలనీ యువత సద్వినియోగం చేసుకోవాలని రాజీవ్ గృహకల్ప కాలనీ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పోతరాజు రాములు కోరారు. జీవితంలో స్వయం ఉపాధి సాధించి, సొంత కాళ్లపై నిలబడేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం ఈ ఫోన్ నెంబర్ 9121323693 సంప్రదించగలరు.

# రామాయంపేట సీహెచ్‌సీ ని సందర్శించిన జిల్లా పరిషత్ సీఈఓ ఎల్లయ్య



- వైద్య సేవలు,మౌలిక వసతులపై సమీక్ష
- రోగులతో మాట్లాడి సేవలపై అభిప్రాయాల సేకరణ

**రామాయంపేట, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :**

మెదక్ జిల్లా రామాయంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ను జిల్లా పరిషత్ సీఈఓ శ్రీ ఎల్లయ్య శుక్రవారం సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, పరిశుభ్రత, మందుల లభ్యత, వైద్య సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డులను సందర్శించిన సీఈఓ, చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వైద్య సేవలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. చికిత్సలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచేలా సేవలు అందించాలని, పరిశుభ్రత, సమయపాలన, రోగుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు.అనంతరం ఆసుపత్రి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి, ఆసుపత్రిలో అందుతున్న సేవలు, అవసరమైన సదుపాయాలు, ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్య క్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డా.లింబాద్రి, వైద్యులు, నర్సింగ్ అధికారులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## 48 గంటల్లో చోరీ కేసు ను చెందించిన పోలీసులు

- 15 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం
- నిందితుడి అరెస్ట్... రిమాండ్ కు తరలింపు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ నరేందర్ గౌడ్



**తూప్రాన్, 31 జులై ( నవజ్యోతి ప్రతినిధి నవీన్ ) :**

మెదక్ జిల్లా తూప్రాన్ సర్కిల్ శివంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పిల్లుట్ల గ్రామంలో ఇటీవల జరిగిన పగటిపూట ఇంటి చోరీ కేసును పోలీసులు వేగంగా ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి సుమారు రూ.15 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదు, ఒక స్మార్ట్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 29న పిల్లుట్ల గ్రామానికి చెందిన బబ్బురి శ్రీశైలం ఇంటికి తాళం వేసి ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి బీరువాలను పగులగొట్టి సుమారు 8 తులాల బంగారు ఆభరణాలు, 99 తులాల వెండి వస్తువులు, కొంత నగదును దొంగిలించి పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు శివంపేట ఎస్ఐ మధుకర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా గతంలో నేర చరిత్ర కలిగిన అనుమానితులపై నిఘా ఉంచిన పోలీసులు పిల్లుట్ల గ్రామానికి చెందిన బబ్బురి గోపాల్ (30), కూలీని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. మద్యం, జల్సాలకు అలవాటుపడి డబ్బుల అవసరం కారణంగా సులభంగా సంపాదించాలనే ఉద్దేశంతో ఈ చోరీకి పాల్పడినట్లు విచారణలో వెల్లడించాడు. నిందితుడి వద్ద నుంచి 96.35 గ్రాముల బంగారు ఆభరణాలు, 721 గ్రాముల వెండి వస్తువులు, ఒక స్మార్ట్‌ఫోన్, రూ.2,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును వేగంగా ఛేదించి సొత్తును రికవరీ చేసిన తూప్రాన్ సీఐ వెంకట్రాజ్ గౌడ్, శివంపేట ఎస్ఐ మధుకర్ రెడ్డి, సిబ్బంది గోవర్ధన్, వెంకట్, కృష్ణ, మహేందర్, శేఖర్, గట్టేష్‌లను తూప్రాన్ డీఎస్పీ అభినందించారు. అనంతరం నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## దేవేందర్ నగర్ లో ఫ్రైడే డ్రైడే అవగాహన కార్యక్రమం

- ఇంటింటికీ వెళ్లి దోమల నివారణపై చైతన్యం
- నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని సూచనలు




**కుత్బుల్లాపూర్, జూలై 31: (నవజ్యోతి ప్రతినిధి)**

వర్షాకాలంలో విజృంభించే దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు సీఎంసీ ఆధ్వర్యంలో గాజులరామారం సర్కిల్–57 పరిధిలోని మహదేవపురం వార్డులోని దేవేందర్‌నగర్ ప్రాంతంలో శుక్రవారం "ఫ్రైడే డ్రైడే – మస్కిటో అవేర్‌నెస్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి దోమల నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాల్లో, కూలర్లు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, టైర్లు, డబ్బాలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా ప్రతి శుక్రవారం ఖాళీ చేసి శుభ్రం చేయాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధుల నివారణకు పరిశుభ్రమైన పరిసరాలే ప్రధాన ఆయుధమని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని, దోమల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంబంధిత గాజులరామారం సర్కిల్ అధికారులు, ఎంటమాలజీ సిబ్బంది, ఫీల్డ్ వర్కర్లు, ఆశా కార్యకర్తలు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## కనీస వేతనాల అమలుకు సీఐటీయూ కరపత్రాల పంపిణీ

### జీవో నెం.6 ప్రకారం జూన్ 1 నుంచే కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్

**నాగారం, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి):**



తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన జీవో నెం.6 ప్రకారం 2026 జూన్ 1 నుంచి సవరించిన కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా, కీసర మండలం, రాంపల్లి పారిశ్రామిక ప్రాంతంలో కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాలను అన్ని పరిశ్రమలు, సంస్థలు తక్షణమే అమలు చేయాలని కోరారు. కార్మికులకు చట్టబద్ధంగా లభించాల్సిన వేతనాలు, ఇతర హక్కులను యాజమాన్యాలు తప్పనిసరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు చింతపల్లి అశోక్ తదితరులు పాల్గొని కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేసి కనీస వేతనాలపై అవగాహన కల్పించారు.

## సర్ డిజిటలైజేషన్‌పై ఈసీఐ కార్యదర్శి ఆకస్మిక తనిఖీ

- పోలింగ్ కేంద్రాల్లో బిఎల్‌ఓలతో ముఖాముఖి.. ప్రక్రియపై క్షేత్రస్థాయిలో ఆరా
- వేగం,పారదర్శకత, ఖచ్చితత్వంతో డిజిటలైజేషన్ పూర్తి చేయాలని ఆదేశం



**కుత్బుల్లాపూర్, జూలై 31: (నవజ్యోతి ప్రతినిధి)**

కొంపల్లి సర్కిల్–56 పరిధిలో కొనసాగుతున్న సార్ డిజిటలైజేషన్ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కార్యదర్శి నవీన్ కుమార్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్కిల్ పరిధిలోని రెండు పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిని నేరుగా పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. సందర్శన సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న బూత్ లెవల్ అధికారులతో (బిఎల్‌ఓలు) సమావేశమైన కార్యదర్శి, సార్ ఫారమ్‌ల డిజిటలైజేషన్‌లో ఎదురవుతున్న సాంకేతిక, పరిపాలనా సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ఏజెంట్ల నుంచి అవసరమైన సహకారం అందుతున్నదా, దరఖాస్తుల పరిశీలన, డేటా నమోదు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయనే అంశాలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ఓటరు జాబితా సవరణ ఎన్నికల వ్యవస్థలో అత్యంత కీలకమైన ప్రక్రియ అని పేర్కొన్న ఆయన, ప్రతి నమోదు పారదర్శకంగా, నిర్దిష్ట నిబంధనల ప్రకారం, పూర్తి ఖచ్చితత్వంతో జరగాలని సూచించారు. డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ తనిఖీ సందర్భంగా ఈఆర్ఓ & జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్,ఏఈఆర్ఓ & డిప్యూటీ కమిషనర్ డి. లావణ్య, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డితో పాటు ఎన్నికల శాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పాటతో ఒక పూట పోస్టర్ ఆవిష్కరణ

**మిర్యాలగూడ, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి)**



కళలను, కళాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో పాటతో ఒక పూట పేరుతో సామాజిక చైతన్య, దేశభక్తి గీతాలు, సంగీతం, సాహిత్యం, నృత్య రూపకాలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాన్ని ఆగస్టు 14న మిర్యాలగూడలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సామాజికవేత్త జాడి రాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం షెడ్యూల్డ్ కులముల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాడి రాజు మాట్లాడుతూ, సమాజంలో దాగి ఉన్న ప్రతిభావంతులైన కళాకారులకు గుర్తింపు కల్పించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. దేశభక్తి గీతాలు, సామాజిక చైతన్య గీతాలు, సంగీత ప్రదర్శనలు, నృత్య రూపకాలు తదితర సాంస్కృతిక పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి కళాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మాడుగుల శ్రీనివాస్, నకిరేకంటి కిరణ్ కుమార్, డాక్టర్ మునీర్, మాలోతు దశరథ్ నాయక్, బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, మహమ్మద్, దాసరాజు జయరాజు, సోమ ఆంజనేయులు, కాకునూరి రవి, జగదీశ్వర్ రెడ్డి, వట్టికోట శ్రీను వెన్నెల, నక్క నాగరాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నాయీ బ్రాహ్మణ సంఘానికి నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- మండల స్థాయిలో సంఘాన్ని బలోపేతం చేయాలని నాయకుల పిలుపు



**బోడుప్పల్, జూలై 31,(నవజ్యోతి ప్రతినిధి) :**

మేడిపల్లి మండల నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బోడుప్పల్‌లో నిర్వహించిన సమావేశంలో గతంలో నాలుగు డివిజన్ల పరిధిలో కొనసాగుతున్న కమిటీలను విలీనం చేసి మండల స్థాయి ఏకీకృత కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీ–బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, 9వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవి, 10వ డివిజన్ అధ్యక్షుడు బండి శ్రీరాములు, 11వ డివిజన్ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్, 12వ డివిజన్ అధ్యక్షుడు పోగుల దిలీప్ రెడ్డి హాజరయ్యారు.నూతన కమిటీలో అవదూత రమేష్ అధ్యక్షుడిగా, శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శిగా, సాయి కోశాధికారిగా, సతీష్ కుమార్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ, నూతన కమిటీ సభ్యులు నాయీ బ్రాహ్మణులను ఐక్యంగా చేర్చి సంఘ అభివృద్ధి, సామాజిక సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సమిష్టిగా పనిచేయాలని కోరారు.ఈ సమావేశంలో రమేష్, రవి, దయానంద్, సాయన్న, ఆంజనేయులు, నరసింహ, సుదర్శన్, యాకయ్య, యాదగిరి, నరేష్,నారాయణదాస్ రాజు, భూపాల్, బాలు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై బీజేపీ కౌన్సిలర్ శంకర్ గౌడ్ గళం

- కుక్కలు, కోతుల బెడద నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్
- 15వ ఆర్థిక సంఘం నిధుల ఖర్చులపై పూర్తి వివరాలు వెల్లడించాలని విజ్ఞప్తి
- పట్టణ అభివృద్ధికి బీజేపీ పూర్తి సహకారం ఉంటుందని స్పష్టీకరణ

**రామాయంపేట, జూలై 31(నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్):**

రామాయంపేట మున్సిపాలిటీలో శుక్రవారం నిర్వహించిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో 8వ వార్డు బీజేపీ కౌన్సిలర్ జె. శంకర్ గౌడ్ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు.పట్టణంలో వీధి కుక్కలు, కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని పట్టుకుని సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు, సామాజిక భద్రతా పింఛన్లు త్వరితగతిన అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు, మున్సిపల్ సాధారణ నిధులు, వాహనాలు, వీధి దీపాల మరమ్మతులపై జరిగిన ఖర్చుల వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రతి రూపాయి పన్నుకు మున్సిపల్ పాలకవర్గం జవాబుదారీతనంతో వ్యవహరించాలని అన్నారు.మున్సిపాలిటీకి చెందిన 13 షాపుల షట్టర్ల అంశం, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, పట్టణ పరిశుభ్రత, అభివృద్ధి పనులపై కూడా సమావేశంలో చర్చించారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పట్టణ అభివృద్ధి వెనుకబడిందని, ప్రస్తుతం ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.పట్టణ అభివృద్ధికి బీజేపీ ఎల్లప్పుడూ నిర్మాణాత్మక సహకారం అందిస్తుందని పేర్కొన్న శంకర్ గౌడ్, అవినీతికి తావులేకుండా పారదర్శక పాలన సాగాలని సూచించారు. ఈ సందర్భంగా రామాయంపేటలో ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.48 కోట్ల మంజూరు, అమృత్–2.0 పథకం కింద ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా కోసం రూ.7 కోట్లతో వాటర్ ట్యాంకుల నిర్మాణం పూర్తిచేసినందుకు ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, ప్రధాని నరేంద్ర మోదీకి పట్టణ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామసభల్లో ప్రజా సమస్యలపై విస్తృత చర్చ

- గ్రామాభివృద్ధి ప్రణాళికలకు ప్రాధాన్యం
- వర్షా కాలంలో అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



**రామాయంపేట,జూలై 31 ( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :**

మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని కాట్రియాల్, పర్వతాపూర్, దంతేపల్లి గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌ల అధ్యక్షతన జరిగిన సమావేశాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గ్రామాభివృద్ధి ప్రణాళికలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారంపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో గ్రామాల్లో వీధి కుక్కల బెడద, పారిశుధ్య సమస్యలు, తాగునీటి సరఫరా, మురుగు నీటి పారుదల, వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, నీరు నిల్వ ఉండకుండా చర్యలు, పరిశుభ్రత నిర్వహణ వంటి అంశాలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించేందుకు గ్రామసభలు కీలక వేదికలని సర్పంచ్‌లు పేర్కొన్నారు. ప్రజల సూచనలను పరిగణనలోకి తీసుకుని గ్రామాభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులు హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ గ్రామసభలకు హాజరై తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో కాట్రియాల్ సర్పంచ్ కొత్త స్రవంతి రాజేందర్, పర్వతాపూర్ సర్పంచ్ కాట్రోత్ తార్యానాయక్, దంతేపల్లి సర్పంచ్ మస్కూరు బాల్‌రాజ్, ఉపసర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, వార్డు సభ్యులు, ఆశా వర్కర్లు, గ్రామ అధికారులు, రైతులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

# కుషాయిగూడ కూరగాయల మార్కెట్‌లో అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

- ప్రభుత్వ ఆదాయానికి గండి.. రైతుల వద్ద అక్రమ వసూళ్లు.. స్థానిక నిరుద్యోగులకు అన్యాయం
- డిప్యూటీ కమిషనర్‌కు కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ వినతి



**కుషాయిగూడ, జూలై 31,(నవజ్యోతి ప్రతినిధి) :**

కుషాయిగూడ కూరగాయల మార్కెట్‌లో షాపుల అక్రమ బదిలీలు, అనధికార వ్యాపారాలు, రైతుల వద్ద అక్రమ వసూళ్లు, ప్రభుత్వ ఆదాయానికి జరుగుతున్న నష్టం, నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర విజిలెన్స్ విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు.మార్కెట్‌లో మొత్తం 219 దుకాణాలు ఉండగా, అందులో 149 కూరగాయల దుకాణాలు, 59 పూజా సామగ్రి దుకాణాలు, 11 మాంసాహార దుకాణాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం తొలుత కేటాయించిన 149 కూరగాయల దుకాణాల్లో ప్రస్తుతం కేవలం 30 మంది అసలు లబ్ధిదారులు మాత్రమే కొనసాగుతున్నారని, మిగిలిన దుకాణాలు అక్రమంగా చేతులు మారినట్లు ఆరోపించారు. ప్రస్తుతం ఒక్కో దుకాణం రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు విక్రయించబడుతున్నట్లు సమాచారం ఉందని, కొందరు వ్యక్తులు మూడు నుంచి పది దుకాణాల వరకు స్వాధీనం చేసుకుని అద్దెల ద్వారా భారీగా లాభాలు పొందుతున్నారని పేర్కొన్నారు.కూరగాయల వ్యాపారానికి కేటాయించిన దుకాణాల్లో రియల్ ఎస్టేట్, ఫైనాన్స్, సెటిల్‌మెంట్ వంటి అనధికార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, మార్కెట్ అసలు లక్ష్యాన్ని పూర్తిగా విస్మరించిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ మార్కెట్‌కు వచ్చే రైతుల వద్ద ఆకు కూరలు, ఇతర కూరగాయలు విక్రయించేందుకు ఒక్కొక్కరి నుంచి రూ.10 నుంచి రూ.20 వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారని, దీనిపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మార్కెట్‌కు సంబంధించిన అద్దె బకాయిలు సుమారు రూ.8 కోట్లకు, విద్యుత్ బిల్లుల బకాయిలు రూ.2 కోట్లకు పైగా పేరుకుపోయినట్లు సమాచారం ఉందని, ఈ అంశాలపై కూడా సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వానికి జరిగిన ఆదాయ నష్టాన్ని వెలుగులోకి తీసుకురావాలని కోరారు. అక్రమంగా బదిలీ చేసిన దుకాణాల కేటాయింపులను రద్దు చేసి, ఒకే వ్యక్తి పేరుపై ఉన్న బహుళ దుకాణాలను స్వాధీనం చేసుకోవాలని, ఖాళీ అయ్యే దుకాణాలను పారదర్శకంగా కుషాయిగూడ ప్రాంతానికి చెందిన పేద నిరుద్యోగ యువతకు కేటాయించాలని అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. మార్కెట్‌లో జరిగిన అన్ని అక్రమాలపై విజిలెన్స్ విభాగంతో ప్రత్యేక విచారణ జరిపించి, ప్రభుత్వానికి జరిగిన ఆర్థిక నష్టాన్ని అంచనా వేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్‌ను కోరింది. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పనగట్ల చక్రపాణి గౌడ్, చల్లా ప్రభాకర్, కొడకండ్ల యాదయ్య, వెంకటేశ్వర్లు, పండాల గణేష్ గౌడ్, దయానంద్, పిట్టల రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పర్వతాపూర్ పుష్పలవాగు బ్రిడ్జికి శాశ్వత నిర్మాణం చేపట్టాలి

- వరద బాధిత రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ డిమాండ్
- రోడ్ల దుస్థితితో నిలిచిన ఆర్టీసీ బస్సులు.. ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

**రామాయంపేట,జూలై 31 ( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :**

రామాయంపేట మండలం పర్వతాపూర్ సమీపంలోని పుష్పలవాగు బ్రిడ్జిని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, దంతపల్లి సర్పంచ్ బాల్‌రాజ్ ఆధ్వర్యంలోని బీజేపీ బృందం శుక్రవారం పరిశీలించింది. గత ఏడాది భారీ వర్షాలకు బ్రిడ్జి ఇరువైపులా కోతకు గురై రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని వారు తెలిపారు. వందల ఎకరాల్లో వరి పంటలు దెబ్బతిని, పొలాల్లో ఇసుక మేటలు పేరుకుపోయినా రైతులకు ఇప్పటి వరకు నష్టపరిహారం అందకపోవడం ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు. తాత్కాలికంగా మట్టితో రాకపోకలు పునరుద్ధరించినా, పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదని ఆరోపించారు.లక్ష్మాపూర్–పర్వతాపూర్– కిషన్ తండా–దంతపల్లి రహదారులు భారీ గుంతలతో ప్రమాదకరంగా మారడంతో ఆర్టీసీ బస్సులు కూడా నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకపోయిందన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి పుష్పలవాగు బ్రిడ్జికి శాశ్వత నిర్మాణం చేపట్టడంతో పాటు రక్షణ గోడలు నిర్మించాలని, దెబ్బతిన్న రహదారులను మరమ్మతు చేయాలని, వరద బాధిత రైతులకు నష్టపరిహారం, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను కలుపుకుని బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని రాగి రాములు, బాల్‌రాజ్ హెచ్చరించారు.



# భారీ వర్షా ల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- వాగులు, వంకలు, కాజ్‌వేల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలి
- లోతట్టు ప్రాంతాలను గుర్తించి పునరావాస కేంద్రాలు సిద్ధం చేయాలి
- - జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, జూలై 31(నవజ్యోతి ప్రతినిధి) :**

రాష్ట్రంలో కొనసాగుతున్న వాతావరణ మార్పులు, భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వచ్చే వారంలో కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తతతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు విపత్తు నిర్వహణ వ్యవస్థను పటిష్ఠంగా సిద్ధం చేయాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్య, వ్యవసాయ, పశుసంవర్ధక, విద్య, మత్స్య, పోలీస్ తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో నమోదైన వర్షపాతం, రానున్న రోజుల వర్ష సూచనలు, తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులతో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసి స్థానిక పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ మీడియా ద్వారా హెచ్చరికలు జారీ చేయాలని చెప్పారు. జిల్లాలోని అన్ని లోతట్టు ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో శిథిలావస్థలో ఉన్న పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాత భవనాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల వారీగా పూర్తి వివరాలను అన్ని శాఖలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. వాగులు, వంకలు, చెరువులు, కుంటలు, కాలువల నీటి ప్రవాహాన్ని ఇరిగేషన్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. కాజ్‌వేలపై నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, ప్రజలను అటువైపు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన చోట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో వరదలు లేదా ఇతర నష్టాలు సంభవించిన వెంటనే సంబంధిత అధికారులు జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించి అత్యవసర చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు, పశుసంపద, పంటలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం జరగకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను మిషన్ మోడ్‌లో నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని, ప్రత్యేక మండల అధికారులు తమకు కేటాయించిన మండలాల్లో స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు.

# ఆగస్టు 5 నుంచి కేంద్ర ఎరువుల యాప్ అమలు...

- వ్యవసాయ శాఖ సిబ్బందికి శిక్షణ
- రామాయంపేట రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన
- అన్ని రకాల ఎరువుల కొనుగోలు కేంద్ర యాప్.



**రామాయంపేట, జూలై 31 ( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఫర్టిలైజర్ యాప్ అమలుపై వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందికి శుక్రవారం రామాయంపేట రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణలో యాప్ వినియోగం,ఎరువుల విక్రయ విధానం, రైతుల నమోదు ప్రక్రియ తదితర అంశాలను వివరించారు.ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వ ఫర్టిలైజర్ యాప్ ద్వారా ప్రధానంగా యూరియా మాత్రమే ఆన్‌లైన్‌లో విక్రయించగా,కొత్త కేంద్ర ఫర్టిలైజర్ యాప్‌లో యూరియాతో పాటు కాంప్లెక్స్ ఎరువులు, ఎంఓపీ (MOP), ఎస్ఎస్‌పీ (SSP) తదితర అన్ని రకాల ఎరువులను తప్పనిసరిగా యాప్ ద్వారానే కొనుగోలు చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. మెదక్ జిల్లాలో ఈ కేంద్ర ఫర్టిలైజర్ యాప్‌ను ఆగస్టు 5 నుంచి అమలులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. యాప్ వినియోగంపై ఎరువుల డీలర్లు, రైతులకు ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొత్త విధానాన్ని అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) ప్రవీణ్, సాయికృష్ణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్.వెంకటాపూర్ గ్రామసభలో ప్రజా సమస్యలపై చర్చ

- గ్రామాభివృద్ధి ప్రణాళికకు ప్రాధాన్యం
- కుక్కల బెడద, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి చర్యలు



**రామాయంపేట, జూలై 31 ( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ )**

రామాయంపేట మండలం ఆర్. వెంకటాపూర్ గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు.గ్రామ సర్పంచ్ గారి ఉమా సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి గ్రామ అధికారులు, ప్రజాప్రతినిధులు,వార్డు సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశంలో గ్రామాభివృద్ధి ప్రణాళిక, మౌలిక వసతుల కల్పన, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, మురుగు కాల్వల శుభ్రత, వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, గ్రామంలో పెరుగుతున్న వీధి కుక్కల బెడద వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఉమా సంజీవరెడ్డి మాట్లాడుతూ, గ్రామసభలు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే వేదికలని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ గ్రామసభలకు హాజరై తమ సూచనలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, రైతులు, మహిళలు, యువత, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీహెచ్ఎస్ యాద్గారిపల్లి పాఠశాలలో గ్రంథాలయం క్రీడ లైబ్రరీ, రూముల ప్రారంభం




**యాద్గారిపల్లి, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి)**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యాద్గారిపల్లిలో శుక్రవారం గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయం క్రీడ రూములను ప్రారంభించారు. పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న తరగతి గదిని చొరవతో మరమ్మతులు చేయించి, పెయింటింగ్ వేయించి విద్యార్థుల వినియోగానికి అందుబాటులోకి తీసుకువచ్చారు. పాఠశాల క్రీడా మైదానాన్ని మట్టితో చదును చేయించి విద్యార్థులకు మెరుగైన క్రీడా వాతావరణాన్ని కల్పించారు. విద్యార్థుల క్రీడాభివృద్ధి కోసం అవసరమైన స్పోర్ట్స్ సామగ్రిని గాయం ఉపేందర్ రెడ్డి పాఠశాలకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధికి అవసరమైన ప్రతి పనిలో తాను ముందుండి సహకరిస్తానని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి ఆదర్శంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గాయం ఉపేందర్ రెడ్డి, వార్డు సభ్యులు వెంకన్న, రామకృష్ణ, సురేష్, ప్రధానోపాధ్యాయులు లావూరి బాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కొనాయిపల్లి లో "వన మహోత్సవం "

## మొక్కలు నాటిన సర్పంచ్ మన్నే కళ్యాణ్ ముదిరాజ్.... గ్రామంలో 5000 మొక్కలు నాటడమే లక్ష్యంగా ముందుకు ..



**మనోహరబాద్, 31 జులై ( నవజ్యోతి ప్రతినిధి నవీన్ ) :**

మెదక్ జిల్లా మనోహరబాద్ మండలంలోని కోనాయిపల్లి (పిటి )గ్రామంలో 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని శుక్రవారం గ్రామ సర్పంచ్ మన్నే కళ్యాణ్ ముదిరాజ్ ,ఉప సర్పంచ్,గ్రామస్తులతో కలిసి నిర్వహించారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో గ్రామస్థుల తో కలిసి 300 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మన్నే కళ్యాణ్ ముదిరాజ్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ లో భాగంగా , గ్రామాన్ని హరితమయంగా మార్చడమే లక్ష్యంగా ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. గ్రామంలో మొత్తం 5,000 మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని. అందులో భాగంగానే నేడు ఈ కార్యక్రమం నిర్వహించామని వెల్లడించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను పాలకవర్గం,గ్రామస్థులందరూ తీసుకోవాలని, పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్, ఉప సర్పంచ్ శ్రవణ్ కుమార్, గ్రామస్తులు నరేందర్ గౌడ్, బాలమల్లేష్, గురుదాస్,పంచాయతి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# స్మశానవాటికలో మౌలిక వసతుల మెరుగుదలకు ఎమ్మెల్యే చర్యలు

## స్మశానవాటికలో సౌకర్యాల కల్పనకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి)

పట్టణంలోని హిందు స్మశానవాటిక పరిసరాల్లో చెట్లు అధికంగా ఉండటం, పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడాన్ని గమనించిన ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులతో మాట్లాడి అసంతృప్తి వ్యక్తం చేశారు. స్మశానవాటిక పరిసరాలను ప్రతిరోజూ మున్సిపల్ కార్మికులతో శుభ్రపరచాలని, పరిశుభ్రమైన వాతావరణం నిరంతరం కొనసాగేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడిన ఎమ్మెల్యేకు సొంత ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలు అద్దె ఇళ్లలో నివసిస్తూ, కుటుంబ సభ్యుల మరణానంతరం అంత్యక్రియల సమయంలో తాత్కాలికంగా ఉండేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసింది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే ఉద్దేశంతో బీఎల్ఆర్ సోదరుల సేవా సంస్థ మరియు రైస్ మిల్లర్స్ యజమానుల సంఘం సహకారంతో హిందూ స్మశానవాటిక ప్రాంగణంలో రెండు విశ్రాంతి గదులను నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రకటించారు. సొంత ఇళ్లు లేని కుటుంబాలు తమ ఆప్తులను కోల్పోయిన సమయంలో అంత్యక్రియలు పూర్తయ్యే వరకు ఆ విశ్రాంతి గదులను వినియోగించుకునేలా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మానవతా దృక్పథంతో చేపడుతున్న ఈ కార్యక్రమం నిరుపేద కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# కేసులు పెరుగుతున్నా... మారని గంజాయి దందా

- పాత నేరస్థుడికి మరోసారి సంకెళ్లు 280 గ్రాముల గంజాయి స్వాధీనం
- సూరారం– కూకట్ పల్లి ఎస్ వోటీ సంయుక్త ఆపరేషన్





కుత్బుల్లాపూర్, జూలై 31 :(నవజ్యోతి ప్రతినిధి)

విశ్వసనీయ సమాచారం మేరకు సూరారం పోలీసులు, ఎస్వోటీ కూకట్‌పల్లి బృందంతో కలిసి శుక్రవారం నిర్వహించిన సంయుక్త ఆపరేషన్‌లో ఖైసర్‌నగర్‌కు చెందిన ఎండీ సలీమ్ అలియాస్ గుడ్డు శర్మ (45)ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి సుమారు 280 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సూరారం ఎస్‌హెచ్‌ఓ కె. బాలరాజు తెలిపారు. నిందితుడిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి, స్వాధీనం చేసుకున్న గంజాయిని సీజ్ చేసిన అనంతరం కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు వెల్లడించారు. ప్రాథమిక విచారణలో నిందితుడు ఇదివరకే ఎన్‌డీపీఎస్ (గంజాయి) కేసుల్లో అరెస్టయిన పాత నేరస్థుడు అని పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతోందని సూరారం సిఐ కె. బాలరాజు తెలిపారు.

# డిమాండ్లు నెరవేర్చకుంటే ఆగస్టు 16 నుంచి రాష్ట్రవ్యాప్త ఆందోళనలు

## ఎస్ ఆర్ డీఎస్ - ఎఫ్ టీఈ ఉద్యోగుల హెచ్చరిక.. జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం

సంగారెడ్డి, జూలై 31 (నవజ్యోతి ప్రతినిది) :



ఎస్ఆర్‌డీఎస్ – ఎఫ్‌టీఈ ఉద్యోగులు తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. పే స్కేల్ అమలు, పెండింగ్ వేతన బకాయిలు, డీజిల్, వసతులు, అడ్మినిస్ట్రేషన్ ఖర్చులు తదితర అంశాలపై పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎఫ్‌టీఈ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో నిరంతరం సేవలు అందిస్తున్నప్పటికీ, కనీస సౌకర్యాలు, న్యాయమైన వేతనాలు, భత్యాలు అందడం లేదని పేర్కొన్నారు. ఫీల్డ్‌లో పనిచేసే ఉద్యోగులు సొంత నిధులతో డీజిల్, ఇతర నిర్వహణ ఖర్చులు భరిస్తున్న పరిస్థితి నెలకొందని తెలిపారు. వినతిపత్రంలో 2026 నుంచి కొత్త పే స్కేల్ అమలు చేయడం, పెండింగ్ బకాయిలు విడుదల చేయడం, పెండింగ్ డీజిల్ బిల్లులు చెల్లించడం, కార్డ్ ప్రింటర్ చార్జీలు పెంచడం, సీఎర్డీ కార్యాలయాల్లో ఫైనాన్స్ విభాగాన్ని బలోపేతం చేయడం, బ్యాంక్ చార్జీల భారం సంస్థే భరించడం, కార్డ్ ప్రింటర్, వసతులు, ఇతర ఫీల్డ్ అలవెన్సులు కల్పించడం వంటి డిమాండ్లను ప్రస్తావించారు. అన్ని సమస్యలను 2026 ఆగస్టు 15లోపు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆగస్టు 16 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని ఎఫ్‌టీఈ ఉద్యోగులు హెచ్చరించారు. సమస్యల పరిష్కారంలో తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# శానిటేషన్ సిబ్బందికి రేయిన్ కోట్లు.. పంపిణీ ...

- వర్షా కాల సన్నద్ధతపై రామాయంపేట మున్సిపాలిటీ దృష్టి
- చైర్పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు చేతుల మీదుగా పంపిణీ
- సాధారణ సమావేశంలో తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలపై సమీక్ష
- ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యమన్న చైర్పర్సన్




రామాయంపేట, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ )

వర్షాకాలంలో శానిటేషన్ సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహించేందుకు అవసరమైన రక్షణ చర్యల్లో భాగంగా రామాయంపేట మున్సిపాలిటీ శుక్రవారం శానిటేషన్ కార్మికులకు రేయిన్ కోట్లు పంపిణీ చేసింది. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ శ్రీమతి గజవాడ లావణ్య నాగరాజు సిబ్బందికి రేయిన్ కోట్లు అందజేశారు.ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ, పట్టణ పరిశుభ్రతను కాపాడడంలో శానిటేషన్ సిబ్బంది సేవలు ఎంతో విలువైనవని అన్నారు. వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ ప్రజలకు అంతరాయం లేకుండా సేవలు అందించేందుకు సిబ్బంది ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ రేయిన్ కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. సిబ్బందికి అవసరమైన సౌకర్యాల కల్పనలో మున్సిపాలిటీ ఎల్లప్పుడూ ముందుంటుందని, ప్రజలకు నాణ్యమైన పారిశుధ్య సేవలు అందించేందుకు మరింత అంకితభావంతో పనిచేయాలని సూచించారు.అనంతరం శానిటేషన్ సిబ్బంది పనితీరును అభినందించిన చైర్పర్సన్, వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మున్సిపల్ సాధారణ సమావేశంలో వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పలు కీలక అంశాలపై చర్చించారు.అన్ని వార్డుల్లో వీధి దీపాల మరమ్మతులు వేగవంతం చేయడం, ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా కల్పించడం, మురికి కాల్వల శుభ్రత చేపట్టడం, వీధి కుక్కలు, కోతుల బెడద నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని సమావేశంలో సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్, మున్సిపల్ మేనేజర్ రఘువరన్, శానిటరీ ఇన్స్పెక్టర్ వనిత, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు,శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తొమ్మిది నెలలుగా మురుగునీటి శుద్ధి

- కేంద్రం బంద్.. 6,240 కుటుంబాలకు నరకయాతన
- దుర్వాసన, దోమలతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు
- వెంటనే చర్యలు తీసుకోవాలని ఆర్ఆర్ ఆర్ టీఆర్ వీ సామాజిక సేవా సంస్థ డిమాండ్
- 6,240 కుటుంబాల ఆరోగ్యంతో చెలగాటం






నాగారం, జూలై 31,(నవజ్యోతి ప్రతినిధి) :

రాంపల్లి ద్విగృహాల కాలనీలో గత తొమ్మిది నెలలుగా మురుగునీటి శుద్ధి కేంద్రం పనిచేయకపోవడంతో 6,240 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆర్ఆర్ఆర్‌టీఆర్‌వీ సామాజిక సంక్షేమ సంస్థ డైరెక్టర్ వెంకట్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, గతంలో నాగారం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సమయంలో మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్వహణ సక్రమంగా సాగేదని, అనంతరం కాలనీ మహానగర పాలక సంస్థ పరిధిలోకి వచ్చిన తర్వాత సంబంధిత అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. మురుగునీటి శుద్ధి కేంద్రం పనిచేయకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి భరించలేని దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు, క్రిమికీటకాలు విపరీతంగా పెరిగి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా 21, 25, 34, 36 బ్లాకుల పరిసరాల్లో నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చిన్నారులు, మహిళలు, వృద్ధులు అనారోగ్య బారిన పడే ప్రమాదం నెలకొందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు సమస్యను పట్టించుకోకపోవడం దురదృష్టకరమని, ప్రజల ఆరోగ్యంతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని వెంకట్ విమర్శించారు. వెంటనే మురుగునీటి శుద్ధి కేంద్రానికి మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించాలని మీడియా ప్రతినిధులకు ఆయన విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ప్రజలను కలుపుకొని ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

# పుష్పాల వాగుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలి

- మాజీ సర్పంచ్లు.
- పుష్పాల వాగును పరిశీలించిన మాజీ సర్పంచ్ లు
- భారీ వర్షా లతో మట్టి రహదారి కోతకు గురవుతోందని ఆందోళన

రామాయంపేట, జూలై 31 ( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :





మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాల్–పర్వతాపూర్ గ్రామాల మధ్య ఉన్న పుష్పాల వాగును మాజీ సర్పంచ్‌లు మైలారం శ్యామ్,పర్వతాపూర్ మాజీ సర్పంచ్ బోయిని స్వామి శుక్రవారం పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగుపై తాత్కాలికంగా మట్టితో చేసిన మరమ్మతులు కోతకు గురవుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు.గతంలో వరదల కారణంగా దెబ్బతిన్న వాగుకు శాశ్వత పరిష్కారం చూపకుండా తాత్కాలిక మరమ్మతు లతో సరిపెట్టడం వల్ల ప్రస్తుతం మళ్లీ ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. దీంతో కాట్రియాల్, పర్వతాపూర్ గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులు రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రస్తుతం కొనసాగుతున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పుష్పాల వాగుకు శాశ్వత రక్షణ గోడలు, బలమైన నిర్మాణ పనులు చేపట్టి ప్రజల ప్రాణాలు, ఆస్తులకు భద్రత కల్పించాలని మాజీ సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు, డప్పు స్వామి, కట్ట నాగరాజు,జీవన్ రాజ్, రాజాగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి మెడికల్ కాలేజీ హాస్టల్‌లో నాసిరకం ఆహారం..

## ఫుడ్ సేఫ్టీ తనిఖీల్లో లోపాల గుర్తింపు

సంగారెడ్డి, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి):



సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీ హాస్టల్‌లో విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి అమృతవల్లి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో వంటగది పరిశుభ్రత, ఆహార నిల్వల నిర్వహణలో పలు లోపాలు గుర్తించినట్లు సమాచారం.తనిఖీల సందర్భంగా వంటకు వినియోగిస్తున్న రవ్వలో పురుగులు, బొద్దింకలు కనిపించినట్లు, వంటగది అపరిశుభ్రంగా ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. అలాగే విద్యార్థులకు సరఫరా చేసిన పాల విషయంలోనూ నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిషేధానికి గురైన సంస్థకు చెందిన పాలను సరఫరా చేసినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. ఈ ఘటన నేపథ్యంలో ఆహార సరఫరా కాంట్రాక్టర్‌పై భారీ జరిమానా విధించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అయితే కాంట్రాక్టర్‌తో పాటు హాస్టల్ ఆహార నాణ్యతను పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారుల బాధ్యతపైనా ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. వందలాది మంది విద్యార్థులు భోజనం చేసే హాస్టల్‌లో ఇలాంటి పరిస్థితులు నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, పలువురు ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హాస్టల్ ఆహార సరఫరా వ్యవస్థపై క్రమం తప్పకుండా నాణ్యతా తనిఖీలు నిర్వహించాలని వారు సూచిస్తున్నారు.

Printed, Published, Owned by MANNE LAXMAN Printed at Saketh Publications, 312, Trinetra Complex, Sangareddy, Telangana 502001 Published from SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001 P.H: 9908123780, Email:navajyothinews@gmail.com, RNI no. TGTEL/25/A2372, EDITOR: MANNE LAXMAN